సోమవారం
05-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 224
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఎన్నికల్లో పోటీ చేయకుండా ఇమ్రాన్ సన్నిహితుడిపై వేటు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సన్నిహితుడు షా మహమూద్ ఖురేషీ ఐదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడని పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ (ఈసీపీ) వెల్లడించింది. దేశ రహస్యాలను బహిర్గతం చేసినందుకు ఆయనకు ఇటీవలే 10ఏళ్ల జైలు శిక్ష విధించారు. ఈ క్రమంలో ఈసీపీ ప్రకటన వెలువడింది. ఫిబ్రవరి 8న జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఐదు రోజుల ముందు ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. ఈ సారి నేషనల్ అసెంబ్లీ ఎన్నికల్లో పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ బ్యాట్ గుర్తుపై పోటీ చేయకుండా ఇప్పటికే ఆంక్షలు విధించారు.

సీట్ల సర్దుబాటు కొలిక్కి?

- చంద్రబాబు-పవన్ భేటీ
- మూడు గంటలపాటు కసరత్తు
- వైసీపీ అసంతృప్తులపైనా దృష్టి
- ఉమ్మడి మేనిఫెస్టోపై సమాలోచనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై చంద్రబాబు-పవన్ కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని టీడీపీ అధినేత చంద్రబాబు నివాసానికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెళ్లారు. వారిద్దరి మధ్య దాదాపు మూడు గంటల పాటు సమావేశం కొనసాగింది. పొత్తులో భాగంగా రెండు పార్టీలకు వచ్చే సీట్ల సంఖ్యపైన, పోటీ చేయబోయే స్థానాలపైనా వారిద్దరు చర్చించారు. టీడీపీ, జనసేన నుంచి పెద్దఎత్తున ఆశావహులు టికెట్లను ఆశిస్తున్నారు. దీంతో సీట్ల సర్దుబాటులో అటూ, ఇటూ అయితే అప్పుడు సీట్లు కోల్పోయే ఆశావహులను ఎలా బుజ్జగించాలన్న దానిపైనా కూడా వారు కసరత్తు చేసినట్లు సమాచారం. వైసీపీ నుంచి టికెట్లు దక్కని ఎమ్మెల్యేలను టీడీపీ, జనసేన కూటమిలోకి ఆహ్వానించే అంశంపైనా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఉమ్మడి మేనిఫెస్టో అంశాన్ని ఎలా రూపొందించాలన్న దానిపైనా చర్చించారు. ఇప్పటికే వారిద్దరి మధ్య ఇది మూడో భేటీ కావడంతో దీనిని తుది కసరత్తుగా భావిస్తున్నారు. ఏ క్షణంలోనైనా సీట్ల జాబితా విడుదలయ్యే అవకాశముంది. ఈ సమావేశంలో ప్రధానంగా ఉభయ గోదావరిజిల్లాలకు సంబంధించి సీట్ల సర్దుబాటుపైనే అధికంగా చర్చించినట్లుగా తెలిసింది. అక్కడ టీడీపీ, జనసేన ఎక్కడెక్కడ పోటీ చేయాలన్న దానిపై నిర్ణయించినట్లు సమాచారం. ఎంపీ స్థానాల్లో జనసేనకు ఎన్ని కేటాయించాలనే విషయంలో ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. జనసేన 40 నుంచి 60 అసెంబ్లీ స్థానాలను ఆశిస్తుండగా... ఆ దిశగా టీడీపీ ఎంతవరకు సీట్ల సర్దుబాటు చేస్తుందనేదీ తేలాల్సి ఉంది. కాగా జనసేనకు 25 నుంచి 30 సీట్లు ఇచ్చేందుకు చంద్రబాబు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే రాజోలు,

- మిగతా 2 లో

దేశానికి పెద్ద విపత్తు బీజేపీ

- ఎన్నికలలో ఓడించాల్సిందే
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

విశాలాంధ్ర-హైదరాబాద్: లోక్‌సభ ఎన్నిల్లో బీజేపీ మరోసారి గెలుపొందితే దేశానికి పెద్ద విపత్తేనని, ఈ విపత్తు నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు సాధ్యమైనంత త్వరగా సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసుకుని, బీజేపీని ఓడించేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. తమిళనాడులో డీఎంకేతో సీపీఐ సంప్రదింపులు మొదలు పెట్టిందని, దేశ వ్యాప్తంగా 'సముచిత స్థానాల్లో సీపీఐ పోటీ చేస్తుందని వెల్లడించారు. ఇక్కడి మక్దూం భవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 2న ప్రారంభమైన సమావేశాలు మూడు రోజుల పాటు కొనసాగాయి. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలు, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, లోక్‌సభ ఎన్నికలపై చర్చించారు.

ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీర్మానాలు తదితర అంశాలను సీపీఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, వినయ్ విశ్వం, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి రాజా మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ఆ ప్రభుత్వ విధానాలను విమర్శించడం ప్రతిపక్ష హక్కు అని, కానీ మోదీ, బీజేపీ ప్రతిపక్షమే ఉండకూడదని భావిస్తున్నాయని ఇటువంటి నియంతృత్వ, ఫాసిస్టు బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో గద్దె దించాలని పిలుపునిచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు తాము సన్నద్ధమవుతున్నామని, ఇందులో భాగంగా మణిపూర్ నుంచి మహారాష్ట్ర, తమిళనాడు నుంచి బీహార్ స్థానిక రాష్ట్ర నాయకత్వానికి సీట్ల సర్దుబాటు ప్రక్రియను సాధ్యమైంత త్వరగా పూర్తి చేయాని సూచించినట్టు వివరించారు. ఇండియా కూటమి ఉమ్మడి ఎన్నికల మ్యానిఫెస్టోను రూపొందిస్తుందని, అదే సమయంలో తమ పార్టీ తరపున మ్యానిఫెస్టోను రూపొందించేందుకు ప్రత్యేక మ్యానిఫెస్టో కమిటీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నిరుద్యోగం, నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని రాజా ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ తీవ్ర అసంతృప్తికి గురిచేసిందన్నారు. అయోధ్యలో రామాలయ అంశాన్ని బీజేపీ దూకుడుగా ప్రచారం చేస్తోందన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేతలో నేరస్తునిగా ఉన్న అద్వాణీకి భారతరత్న ఇచ్చారన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టనున్న సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశ్వవిద్యాలయాల్లో డి రిజర్వేషన్స్ ఇవ్వాలని కోరుతూ తీర్మానాలు ఆమోదించినట్టు రాజా వివరించారు.

ఆ ఐదు రాష్ట్రాల ఫలితాలు గుణపాఠం

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి నేతలకు ఒక గుణపాఠం కావాలని రాజా అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సక్రమంగా సీట్ల సర్దుబాటు జరగలేదని ఒక ప్రశ్నకు సమాధానం ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఐతో అవగాహన కుదిరిందని గుర్తు చేశారు. కూటమిలో భాగంగా కాంగ్రెస్, ఇతర పార్టీలకు పరస్పర విశ్వాసం ఉండాలని, అవగాహన ఉండాలని సూచించారు.

నితీశ్‌కు బీహార్ ప్రజలు గుణపాఠం చెబుతారు

ఇండియా కూటమిని మోసం చేసిన బీహార్ సీఎం నితీశ్ కుమార్‌కు ఆ రాష్ట్ర ప్రజలు తగిన గుణ పాఠంచెబుతారని డి.రాజా అన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష మొదటి సమావేశంలో బీజేపీ హఠావో, దేశ్ బచావో అని నినాదం చేసిన నితీష్ కుమార్, ఇండియా కూటమి నుంచి తిరిగి ఎన్‌డీఏ కూటమిలోకి ఎలా వెళ్లారని నితీశ్ సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ప్రతిపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఒక పావుగా ఉపయోగిస్తోందని విమర్శించారు. గవర్నర్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నదని రాజా దుయ్యబట్టారు.

వినయ్ విశ్వం మాట్లాడుతూ పార్లమెంట్‌లో వామపక్ష పార్టీల సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ లెఫ్ట్ పోరాట పటిమ బీజేపీకి తెలుసని, అందుకే పార్లమెంట్ గత సమావేశంలో సీపీఐ నుంచి ఇద్దరు, సీపీఎం నుంచి ఇద్దరు సభ్యులను సస్పెండ్ చేశారన్నారు. ప్రజలకు శత్రువుగా మారిన బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష' శక్తులు ముందుకు రావాలని కోరారు. డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అనేక నియోజకర్గాలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ ఎల్డీఎఫ్ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించే కేరళలో పోటీచేయడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీని ఓడించేందుకు దేశ వ్యాప్తంగా ఇండియా కూటమి పనిచేస్తున్న నేపథ్యంలో కేరళలో రాహుల్ పోటీ చేయడం ఆరోగ్య వాతావరణం కాదని సూచించారు. ఒక ముద్దాయికి భారతరత్న ఇచ్చారని ఎల్.కె.అద్వాణీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

మ్యానిఫెస్టో కమిటీ

లోక్‌సభ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో సీపీఐ జాతీయ సమితి 'ఎన్నికల మ్యానిఫెస్టో' కమిటీని ఏర్పాటు చేసింది. సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్‌జిత్ కౌర్, డాక్టర్ బీకే కాంగో, నాగేంద్రనాథ్ ఓజా, జాతీయ కార్యవర్గ సభ్యులు అనీరాజా, రాజ్యసభ సభ్యులు పి.సంతోశ్ కుమార్ లను కమిటీ సభ్యులుగా నియమించారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర శాసనసభ, మండలి సమావేశాలు ఈనెల 5వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్నికల ముందు జరుగుతున్న ఈ సమావేశాల్లో భాగంగా, ఈనెల 6వ తేదీన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగం తర్వాత తొలిరోజు శాసనసభ వాయిదా పడుతుంది. అదే రోజు బీఏసీ నిర్వహించిన అనంతరం సమావేశాలు ఎన్ని రోజులు జరుగుతాయన్న అంశంపై స్పష్టత వస్తుంది. దాదాపు మూడు లేదా నాలుగు రోజులు ఈ విడత సమావేశాలు జరిగే అవకాశముంది. ఈ బడ్జెట్ సమావేశాల్లో కొన్ని కీలక బిల్లులు ప్రవేశపెట్టి, వాటిని ఆమోదించనున్నారు. మూడు నెలలకు సంబంధించిన జమా ఖర్చులపై ఈ బడ్జెట్‌లో ఆమోదిస్తారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ దగ్గర, అసెంబ్లీకి వచ్చే రోడ్డు మార్గాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇదీ లోకం!

అది మన పార్టీ 'సిద్ధం' గ్రాఫ్ అట!

అరకొర పోస్టుల డీఎస్సీపై నిరుద్యోగుల ఆగ్రహం

- నడిరోడ్డున 7 లక్షల మంది
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- అనంతపురంలో 4 వేల మందికి 4 పోస్టులు
- పోస్టులు పెంచాలని ఉద్యమం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వ విధానాలు నిరుద్యోగుల పాలిట శాపంగా మారాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత విధానాలపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు రెండు నెలల ముందు అరకొర పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంపై నిరుద్యోగులు ఉద్యమిస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలని, అసెంబ్లీ బడ్జెట్‌లో ఆ దిశగా ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులంతా రోడ్డెక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్నారు.

కృష్ణాజిల్లాలోని అవనిగడ్డ, తిరుపతి, ప్రకాశం తదితర ప్రాంతాల్లో నిరసనలు ప్రారంభమయ్యాయి. అనంతపురంలో కలెక్టరేట్ ముట్టడికి నిరుద్యోగులు ప్రయత్నించారు. డీఎస్సీ అభ్యర్థుల నిరసనలకు నిరుద్యోగ, విద్యార్థి, యువజన సంఘాలు సంఘీభావం తెలుపుతున్నాయి. రాష్ట్ర స్థాయి ఉద్యమానికి నిరుద్యోగ సంఘాలు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. గతంలో మెగా డీఎస్సీ ఇవ్వాలంటూ సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. అనేక ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేపట్టాయి. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వం దిగివచ్చి మెగా డీఎస్సీ ఇస్తుందని నిరుద్యోగులు ఆశించగా, అందుకు విరుద్ధంగా మొక్కుబడిగా డీఎస్సీని ప్రకటించింది. నిరుద్యోగులంతా ఆగ్రహంతో ఉన్నారు. 2022 టెట్ పరీక్ష 6.50 లక్షల మంది నిరుద్యోగులు రాశారు. ప్రస్తుత డీఎస్సీకి ఆ సంఖ్య ఏడు లక్షలకు చేరే అవకాశముంది. ఐదేళ్ల తర్వాత ప్రకటించిన డీఎస్సీలో కేవలం 6,100 ఉపాధ్యాయ పోస్టులు ఉండటంపై తప్పుపడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 30వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటన్నిటినీ భర్తీ చేయకుండా, కేవలం ఎన్నికల ముందు నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు మొక్కుబడిగా డీఎస్సీని ప్రకటించింది. ఈ విధానం ద్వారా జిల్లాల వారీగా డీఎస్సీ పోస్టులు కుదించుకుపోతాయి. అనంతపురం జిల్లాలో నాలుగున్నరేళ్ల నుంచి నాలుగువేల మంది డీఎస్సీ కోసం వేచిచూస్తుంటే, అక్కడ కేవలం నాలుగు ఎస్జీటీ పోస్టులను మాత్రమే ఖాళీలను చూపించారు. అతి తక్కువ పోస్టులను చూపించడంపై ప్రతిపక్ష పార్టీలు ధ్వజమెత్తుతున్నాయి. ఉన్న పోస్టులన్నీ పెంచి డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయి.

అప్రంటీస్‌తో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

అప్రంటీస్ విధానం ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంపైనా నిరుద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తూర్పారబడుతున్నాయి. రెండేళ్లపాటు అప్రంటీస్ విధానంతో ఉపాధ్యాయులను ఎంపిక చేయడం వల్ల వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోతుంది. గతంలో ఉన్న అప్రంటీస్ విధానంపై ఉపాధ్యాయ సంఘాల ఆందోళనతో రద్దయింది. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అప్రంటీస్ విధానాన్ని తీసుకురావడంపై నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విధానం రాబోయే అన్ని ఉద్యోగాలకు వర్తింపజేసే అవకాశముంది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలను పోటీ పరీక్ష ద్వారా ఎంపిక చేశారు. ఆ తర్వాత వారికి ఉద్యోగాల క్రమబద్ధీకరణ విషయంలో రెండేళ్లు పూర్తయిన వారికి ఏపీపీఎస్సీ ద్వారా డిపార్టుమెంటల్ పరీక్షలు రాయించేలా నిబంధన విధించారు. అందులో అర్హత పొందిన

- మిగతా 2 లో

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

సీపీఐ జాతీయ సమితి డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యభజన చట్టంలో నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని సీపీఐ జాతీయ సమితి డిమాండ్ చేసింది. ఇక్కడ జరుగుతున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాలలో ఆదివారం సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. మోదీ ప్రభుత్వం పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసున్న దన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను అమలు చేయాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు నిధులు మంజూరు చేయాలని తీర్మానం డిమాండ్ చేసింది. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపేయాలని, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిన పోలవరానికి నిధులు మంజూరు చేయాలని, దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని, విశాఖ మెట్రో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు, విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 15 ఆర్థిక సంఘం చైర్మన్ సూచన మేరకు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హోదా ఇవ్వటం ద్వారా పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని దాంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రాష్ట్ర పురోభివృద్ధికి తోడ్పాలని సీపీఐ జాతీయ సమితి ఆమోదించిన తీర్మానం డిమాండ్ చేసింది.

జార్ఖండ్ అసెంబ్లీలో నేడు బలపరీక్ష

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీలో సోమవారం బలపరీక్ష జరుగనున్నది. అవినీతి ఆరోపణల కేసులో ఈడీ అరెస్ట్‌కు ముందు హేమంత్ సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రవాణా మంత్రి చంపై సోరెన్ ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. దీంతో అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), భాగస్వామ్య పార్టీలకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు హైదరాబాద్‌కు తరలించారు. సోమవారం అసెంబ్లీలో విశ్వాస పరీక్ష జరుగనున్న నేపథ్యంలో వారంతా రాంచీకి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా, 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీలో ఒక స్థానం ఖాళీగా ఉంది. దీంతో మెజారిటీ సంఖ్య 41. అయితే జేఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వానికి అసెంబ్లీలో మెజారిటీ ఉంది. ఆ పార్టీకి 28 మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రభుత్వంలో భాగంగా ఉన్న కాంగ్రెస్‌కు 16, ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్)కు చెరొక ఎమ్మెల్యే ఉన్నారు. దీంతో అధికార జేఎంఎం కూటమికి మొత్తంగా 46 మంది సభ్యులున్నారు. మరోవైపు ప్రతిపక్ష బీజేపీకి 25 మందితోపాటు దాని మిత్ర పక్షాలతో కలిపి 29 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో

- మిగతా 2 లో

ఓపీఎస్ ముద్దు... సీపీఎస్ వద్దు

విశాఖలో 26 జిల్లాల సీపీఎస్ ఉద్యోగుల నిరసన దీక్ష

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఉద్యోగులకు ఓపీఎస్ ముద్దు అని... జీపీఎస్ వద్దని, ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన దీక్షకు దిగారు. సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సీపీఎస్ ఉద్యోగులు అక్కడకు చేరుకుని 'వెన్నుపోటు దీక్ష' పేరిట ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. కమిటీలతో కాలయాపన చేయనని చెప్పి నేడు సీపీఎస్ ఉద్యోగులందరికీ అవిశ్వాస పాత్రులుగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారని మండిపడ్డారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలతో పోలుస్తూ, మాటిస్తే మడమ తిప్పనంటూ బూటకపు మాటలు చెప్పి సీపీఎస్ ఉద్యోగులను నమ్మించి ఎన్నికల్లో లబ్ధి పొంది, నేడు చీకటి చట్టం జీపీఎస్ పేరిట ఉద్యోగులను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఈ రెండేళ్ల కాలంలో ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించి వారక్కడ ఆదర్శంగా నిలిచారన్నారు. పాత పెన్షన్ అమలు చేస్తామని చెప్పి నమ్మబలికిన జగన్ అధికారంలోకి వచ్చాక దారుణంగా మోసం చేశారని

- మిగతా 2 లో

చిలీలో కార్చిచ్చు బీభత్సం... 46 మంది మృతి

శాంటియాగో: లాటిన్ అమెరికా దేశం చిలీలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. ఈ కారణంగా ఇప్పటివరకు సుమారు 46 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆ దేశ అధ్యక్షుడు గాబ్రియల్ బోరిక్ తెలిపారు. సహాయక సిబ్బందికి సహకరించాలని ఆయన చిలీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో సెంట్రల్ చిలీలో అత్యయిక పరిస్థితి విధించినట్లు వెల్లడించారు. కార్చిచ్చు వల్ల శుక్రవారం నుంచి ఇప్పటి వరకు దాదాపు 1,100 ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు అక్కడి ప్రభుత్వం తెలిపింది. పర్యాటక ప్రాంతాలైన వినా డెల్‌మార్, వాల్పరైజో ప్రాంతాల్లో మంటల తీవ్రత అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దట్టంగా పొగ వ్యాపించడం వల్ల ఆయా ప్రాంతాల్లోని పర్యాటకులు, స్థానికులను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలిస్తున్నారు. మరోవైపు వేడిగాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని నేషనల్ ఫారెస్ట్రీ కార్పొరేషన్ హెచ్చరించింది. 'వాల్పరైజో ప్రాంతంలో నాలుగు పెద్ద కార్చిచ్చులు సంభవించాయి. ఈ ఘటనలో ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మంటలు అంటుకున్న ప్రాంతాలకు అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడానికి తీవ్రంగా శ్రమించారు. సహాయక చర్యలు నిర్వహిస్తున్న అధికారులకు చిలీ ప్రజలు సహకరించాలి. మంటలు వేగంగా వ్యాప్తిస్తున్నాయి. మీరు నివసిస్తున్న ప్రాంతాన్ని ఖాళీ చేయాలని అధికారులు కోరితే వెంటనే ఖాళీ చేయండి' అని అధ్యక్షుడు గాబ్రియల్ బోరిక్ కోరారు. 'దేశంలోని సెంట్రల్, దక్షిణ ప్రాంతాల్లోని సుమారు 92 అడవుల్లోని 43వేల ఎకరాల్లో ఈ కార్చిచ్చు మంటలు చెలరేగాయి. ఈ వారం ఉష్ణోగ్రతలు కూడా అసాధారణంగా ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారిపై ప్రభావం అధికంగా ఉంది. ఈ కారణంగా వేలాది మంది ప్రజలు తమ నివాసాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది' అని హోం మంత్రి కరోలినా తోహా పేర్కొన్నారు.

ఇజ్రాయిల్ మారణకాండపై

పశ్చిమదేశాల ఉద్యోగుల నిరసన

వాషింగ్టన్: అమెరికా, బ్రిటన్, ఈయూ దేశాలు ఇజ్రాయిల్ అనుకూల విధానాన్ని అనుసరిస్తున్నందుకు ఆయా దేశాల అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజాగా 800మందికి పైగా సివిల్ సర్వెంట్లు ఈ విషయమై తమ నిరసన తెలుపుతూ ఒక లేఖ విడుదల చేశారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ విషయంలో తమ ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. న్యూయార్క్ టైమ్స్ ఈ లేఖను ప్రచురించింది. గాజాలో ఇజ్రాయిల్ వ్యవహరిస్తున్న తీరును చూసీ చూడనట్లుగా పోతున్న పశ్చిమ దేశాల ప్రభుత్వాలు అంతర్జాతీయ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని,

యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాయని, జాతి ప్రక్షాళనకు, మారణకాండకు అనుమతిస్తున్నాయని ఆ లేఖలో సివిల్ సర్వెంట్లు విమర్శించారు. గాజాపై సాగిస్తున్న యుద్ధంలో ఇజ్రాయిల్ ఎలాంటి హద్దులను పాటించడం లేదని, ఫలితంగా వందలు, వేల సంఖ్యలో సామాన్యులు మరణిస్తున్నారని, ఉద్దేశపూర్వకంగానే సాయం అందకుండా చేస్తున్నారని, దీంతో వేలాదిమంది ఆకలి బాధతో అల్లాడుతూ, మృత్యు ముంగిటకు చేరుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అమెరికా నేతృత్వంలోని కూటమి దేశాల్లో ప్రజా రంగంలో వున్న ఉద్యోగులు ఇటువంటి అసమ్మతి ప్రకటన జారీ చేయడం ఇదే మొదటిసారని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. వీరిలో ప్రధానంగా విదేశీ మంత్రిత్వ శాఖలకు చెందినవారు ఎక్కువగా వున్నారు. కాల్పుల విరమణకు పిలుపునిస్తూ, ఇంతకు ముందు అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి ఇల్హాన్ ఒమర్, జర్మనీ ఎంపి సెవియం డాగ్దెలాన్‌లు తీసుకువచ్చిన పిటిషన్‌పై వివిధ దేశాలకు చెందిన వందలాదిమంది సంతకాలు చేయడం విశేషం.

ట్రంప్ ఓటమి ఖాయం: బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ నుంచి మరోసారి అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న జో బైడెన్... ఆ దిశగా ఆత్మ విశ్వాసాన్ని కూడగట్టుకున్నారు. దక్షిణ కరోలినా ప్రైమరీకి జరిగినలో ఆయన ఘన విజయం సాధించారు. మిన్నెసోటా ప్రతినిధి డీన్ ఫిలిప్స్, రచయిత మెరియన్ విలియమ్సన్‌పై ఆయన గెలుపొందారు. ఈ సందర్భంగా బైడెన్ మాట్లాడుతూ... 2020లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ దక్షిణ కరోలినా ఓటర్లు తన విజయానికి బాటలు వేశారని పేర్కొన్నారు. 2024లోనూ ఇదే తరహా ఫలితాలు పునరావృతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష రేసులో ఉన్న అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు ఓటమి తప్పదని స్పష్టం చేశారు. అయితే ఇప్పటికే న్యూ హాంప్‌షైర్ రిపబ్లికన్ ప్రెసిడెంట్ ప్రైమరీలో ప్రత్యర్థి నిక్కీ హేలీపై డొనాల్డ్ ట్రంప్ గెలుపొందడం గమనార్హం. '2020లో దక్షిణ కరోలినా ప్రజలు తప్పు చేశారని నిరూపించారు. ఇప్పుడు వీరు అందించిన విజయం మా ప్రచారానికి కొత్త ఊపిరి పోసింది. నేను విజయం దిశగా వెళ్లేందుకు ఈ ప్రాంతం ఓటర్లంతా ఏకతాటిపైకి వచ్చారు. రానున్న ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించి నన్ను మళ్లీ అధ్యక్షుడిగా మీరు చూడాలనుకుంటున్నారన్న విషయం నాకు స్పష్టంగా అర్థమవుతోంది. దీంట్లో ఎటువంటి సందేహం లేదు' అని బైడెన్ అన్నారు. తాజాగా జరిగిన సౌత్ కరోలినా ప్రైమరీలో బైడెన్ గెలవబోతున్నట్లుగా వివిధ మీడియా సంస్థలు ఇదివరకే జోస్యం చెప్పాయి. దక్షిణ కరోలినా ప్రాంతాన్ని రిపబ్లికన్లకు కంచుకోటగా చెబుతారు. ఇక్కడ నాలుగింట ఒకవంతు నల్లజాతీయులే ఉంటారు. ప్రస్తుత లెక్కల ప్రకారం ఇక్కడ 26 శాతం మంది నల్లజాతి ఓటర్లు ఉన్నారు. కాగా, దేశం మొత్తం ఓటర్లలో వీరి వాటా 11 శాతం. గత ఎన్నికల్లో ప్రతీ 10 మంది నల్లజాతీయుల్లో 9 మంది ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌కే జై కొట్టారని ఏపీ ఓట్‌క్యాస్ట్ సర్వేలో తేలింది. తాజాగా జరిగిన ప్రైమరీలోనూ బైడెన్ గెలవడానికి వీరే కారణం కావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నమీబియా అధ్యక్షుడు హేజ్ గింగోబ్ మృతి

విండ్‌హోక్: నమీబియా అధ్యక్షుడు హేజ్ గింగోబ్ (82) మరణించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన.. ఆదివారం ఉదయం దేశ రాజధాని విండ్‌హెక్‌లోని లేడీ పోహంబా ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచినట్లు అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఆయనకు ఇటీవలే క్యాన్సర్ ఉన్నట్లు తేలగా... చికిత్స కోసం అమెరికా వెళ్తారని వార్తలు వచ్చాయి. అంతలోనే ఆయన మరణ వార్త దేశ ప్రజలను విషాదంలోకి నెట్టింది. 2015లో దేశాధ్యక్షుడిగా ఎన్నికైన గింగోబ్ సుదీర్ఘకాలం దేశాన్ని పాలించారు. ఆయన మృతి దేశానికి తీరని లోటని, తదుపరి కార్యాచరణపై కేబినెట్ భేటీ అనంతరం ప్రకటన చేస్తామని తాత్కాలిక అధ్యక్షుడు అంగోలో ముంబా ప్రకటించారు. ఈ ఏడాది నవంబరులో దేశంలో అధ్యక్ష, పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి.

షర్మిలపై దుష్ప్రచారాన్ని ఖండించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో దిగజారుడు రాజకీయాలు నడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచ్ఛరించటానికి వీలు లేని పద్ధతిలో ప్రశ్నలు వేయటం, వ్యక్తిగతంగా దూషించటమే కాకుండా ఆమె కుటుంబాన్ని, క్యారెక్టర్‌ను కించపర్చుస్తూ ప్రచారం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విమర్శలనేవి పార్టీ విధానాల పరంగా ఉండాలన్ని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతున్న వారిపై వైసీపీ శ్రేణులు దుష్ప్రచారాలు చేయటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సొంత చెల్లెలిపై నీచంగా పేజీఎం బ్యాచ్ ప్రచారం చేయటాన్ని దుర్మార్గం అని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని రామకృష్ణ అన్నారు.

రైతాంగం సమస్యలు పరిష్కరించాలి

8న రాష్ట్రవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయండి: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాయచోటి టౌన్: రాష్ట్రంలో రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కరువు విలయతాండవం చేస్తుంటే జగన్ సర్కార్ మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం చాలా దారుణమన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతులను, వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కరువు, తుపాను బాధితులను ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అనేక సార్లు పోరాటం చేసినప్పటికీ ముఖ్యమంత్రికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య, పింఛా ప్రాజెక్టుల పనులు పూర్తిగా నత్తనడకన నడుస్తున్నాయని, అసలు అన్నమయ్య ప్రాజెక్టు పనులు ప్రారంభమే కాలేదని, యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు, కౌలు రైతులకు రెండు లక్షల రూపాయల వరకు అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలని, ప్రతి ఎకరానికి రూ.15 వేలు సాగు సాయం అందించాలి. కరువు, తుపాను వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణం ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 8న ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు.

బంగారం నాణ్యత నిర్ధారణకు

పైల్‌టెస్ట్ అనుమతించాలి

విశాలాంధ్ర-విజయవాడ: బంగారం నాణ్యతను గుర్తించేందుకు బ్యాంకు వారు పైల్ టెస్ట్‌ను అనుమతించాలని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ చైర్మన్ బీవీవీ కొండల రావు డిమాండ్ చేశారు. యూనియన్ కోర్ కమిటీ సమావేశం ఆదివారం స్థానిక గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆభరణాలను కత్తిరించి...వాటిని యాసిడ్‌తో పరీక్షించేందుకు అవకాశం కల్పించాలన్నారు. రీ అప్రైజింగ్ ఛార్జీలను చెల్లించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మదింపుదారులకు రీ అప్రైజింగ్ చార్జీలు ఇవ్వట్లేదని తెలిపారు. 65 సంవత్సరాల వరకు మూల్యాంకనం కోసం మదింపుదారులను అనుమతించినందుకు యాజమాన్యానికి సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. మదింపుదారులు శాశ్వత పనిని కాంట్రాక్టు పద్ధతిలో చేస్తున్నారని వారినే ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్ 1947 ప్రకారం వర్కమెన్ స్థాయిని కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో బంగారు మదింపుదారుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రెసిడెంట్ రాఘవాచారి అనారోగ్యం కారణంగా పదవికి తన రాజీనామాను సమర్పించారు. దానిని సమావేశంలో సభ్యులు అంగీకరించారు. ఆయన స్థానంలో నూతన అధ్యక్షుడుగా కె.శ్రీనివాస చక్రవర్తిని ఎన్నుకున్నారు. రాఘవాచారి త్వరగా కోలుకుని యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ముందుగా యూనియన్ జనరల్ సెక్రటరీ వై కుమారస్వామి యూనియన్ కార్యకలాపాలను వివరించి, మాజీ అధ్యక్షులు రాఘవాచారి సేవలను కొనియాడారు. కోశాధికారి ఎల్. నరేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో యూనియన్ కార్యకలాపాలను పెంచవలసి ఉందని, మదింపుదారులు కొనసాగుతున్న సంస్థలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ మధుసూదనరావు, నాయకులు ప్రవీణ్, ఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక కార్యదర్శి శివ ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

'పద్మశ్రీ'లకు రూ.25 లక్షల నగదు

- ప్రతి నెలా రూ.25 వేల ప్రభుత్వ పెన్షన్
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- భాష, సాంప్రదాయాల్ని కాపాడుకోవాలని పిలుపు
- పద్మ అవార్డు గ్రహీతలకు ఘన సత్కారం

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలో అత్యధికంగా మాట్లాడుకునే భాషలలో తెలుగు భాష రెండవ స్థానంలో ఉందని, అలాంటి మన తెలుగు వారికి పద్మ అవార్డులు దక్కడం గర్వ కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం శిల్పకళా వేదికపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పద్మ అవార్డు గ్రహీతల సన్మాన సభకు రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పద్మ విభూషణ్ అవార్డు గ్రహీతలైన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సినీనటుడు చిరంజీవి, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు వేలు ఆనందాచారి, దాసరి కొండప్ప, ఉమా మహేశ్వరి, గడ్డం సాంబయ్య, కేతావత్ సోమ్ లాల్, కూరెళ్ల విఠలాచార్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కవులను, కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం ప్రభుత్వాల బాధ్యతని... అలా జరగనపుడు మన భాష, సాంప్రదాయాలు అంతరించి పోయే ప్రమాదం ఉంటుందన్నారు. భాష, సాంవప్రదాయాలను కాపాడుకోవడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకం అవ్వాలని పిలుపునిచ్చారు. ఒక మంచి సంప్రదాయానికి పునాది వేసేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కళాకారులను ప్రోత్సహించేందుకే రాజకీయాలకు అతీతంగా పద్మ అవార్డు గ్రహితలకు సన్మాన సభ ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు రూ.25 లక్షల నగదు బహుమతి, ప్రతి నెల రూ.25 వేల పెన్షన్ ను ప్రభుత్వం అందిస్తుందని ప్రకటించారు. భారత దేశంలో అత్యధిక దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించి ప్రజల సమస్యలు తెలుసుకున్న ఏకైక నాయకుడు వెంకయ్య నాయుడని అలాంటి వారు దేశ ఉప రాష్ట్రపతిగా పని చేయడం మన తెలుగు వారికి గర్వ కారణమని అన్నారు. భవిష్యత్తులో వారు రాష్ట్ర పతి పదవిని కూడా చేపట్టాలని ఆకాంక్షించారు. ఒకటి రెండు సినిమాలు విజయవంతమవగానే గర్వపడే నటులు ఉన్న ఈ రోజులలో 46 సంవత్సరాలు నిర్విరామంగా 150 కి పైగా సినిమాలు చేసి కూడా నిగర్విగా ఉండటం ఒక చిరంజీవికే చెల్లిందని కితాబునిచ్చారు. కవులు, కళాకారులు, భాష, సాంప్రదాయాలను కాపాడు కునేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందంజలో ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. వెంకయ్య నాయుడు, చిరంజీవి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు రూ.25 లక్షల నగదు బహుమతి చెక్కులను అందచేశారు.

చిరు- వెంకయ్యలు ఆదర్శప్రాయులు: భట్టి విక్రమార్క

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగస్టార్ చిరంజీవి నేటి రాజకీయనాయకులకు, నేటి యువతరానికి ఆదర్శప్రాయులని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారతదేశం గర్వించే విధంగా తెలుగు వారు పద్మ అవార్డులు పొందడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను గౌరవించి ప్రోత్సహిస్తుందన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉండి వివిధ సాహితి , కళ రంగాల్లో రాణిస్తున్న వారి నైపుణ్యాన్ని గుర్తించి, గౌరవించి, అవార్డులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాలను పుణికిపుచ్చుకొని గొప్ప నేతగా, రాజనీతి జ్ఞుడిగా వెంకయ్య నాయుడు ఎదిగారని కొనియాడారు. ప్రజల సమస్యలను ముక్కు సూటిగా, స్పష్టంగా తిట్ల పురాణం లేకుండా వేలెత్తి చూపించే విధంగా ఆయన వాగ్ధాటి ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో విలువలు పాటించడం ఎలానో వెంకయ్యనాయుడి నుంచి నేర్చుకోవాలన్నారు. సినిమా రంగంలో స్వయం కృషితో పట్టుదలతో మెగస్టార్ గా ఎదిగిన చిరంజీవి మనందరికీ స్ఫూర్తి అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లోనే కాకుండా ఈ సమాజానికి సేవ చేయాలని రక్త, నేత్ర దాన కేంద్రాలు ఏర్పాటు చేసి సామాజిక సేవలో కూడ ముందున్నారని కొనియాడారు. దేశంలోని సినీ నటులందరూ చిరంజీవిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళితే దేశానికి మేలు జరుగుతుందన్నారు.

చిరంజీవి తెలుగు కళామతల్లికి మూడో కన్ను: వెంకయ్య నాయుడు

సభలో పద్మవిభూషణ్ గ్రహీత, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... తెలుగు కళామతల్లికి మొదటి రెండు కళ్లు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ అయితే మూడో కన్ను చిరంజీవి అన్నారు. తనతో పాటు చిరంజీవికి పద్మ విభూషణ్ రావడం సంతోషంగా ఉందన్నారు. తన జీవితంలో అవార్డులు, సన్మానాలు పెద్దగా తీసుకోలేదని, పద్మవిభూషణ్ పురస్కారం ఇస్తున్నట్లు కేంద్రం చెబితే ప్రధాని మోదీపై గౌరవంతో అంగీకరించానని చెప్పారు. 'పద్మ పురస్కారాలకు ఎంపికైన తెలుగు వారికి సన్మానం చేయడం గొప్ప విషయం. సీఎం రేవంత్‌ను అభినందిస్తున్నా. గుర్తింపు పొందని వ్యక్తులకు అది లభించేలా పద్మ అవార్డులు ప్రకటించారు. మట్టిలో మాణిక్యాలను గుర్తించి ఈ పురస్కారాలు ఇవ్వడం గొప్ప విషయం. రాజకీయాల్లో ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. దీన్ని సరిదిద్దాల్సిన కర్తవ్యం మనందరిది. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు విలువలు పాటించాలి. తెలుగు కళామతల్లికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు.. చిరంజీవి మూడో కన్ను. పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధ్యమే' అన్నారు.

నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరుతో సినీ అవార్డులు హర్షణీయం: చిరంజీవి

ప్రజాగాయకుడు గద్దర్ పేరుతో సినీ అవార్డులు ప్రదానం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, మెగాస్టార్ చిరంజీవి అన్నారు. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను ఇవ్వనుండటం శుభపరిణామమన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. తనకు పద్మ విభూషణ్ అవార్డు రావడం ఆనందంగా ఉందని... వారం రోజులుగా అందరూ వచ్చి అభిమానం చూపిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మనవాళ్లను మనం గౌరవించకోకపోతే ఎలా అని ఆలోచించడం గొప్ప విషయమన్నారు. అవార్డులు ప్రకటించిన వెంటనే ఇలా సన్మానించడం ఇదే తొలిసారని... అవార్డులు కళాకారులకు ఎంతో ప్రొత్సాహాన్ని ఇస్తాయని చిరంజీవి అన్నారు. సభ ఇంత నిండుగా ఉందంటే.. దానికి కారణం వెంకయ్య నాయుడని... ఆయన తెలుగుతనానికి నిలువెత్తు నిదర్శనమని, తెలుగు భాషను గొప్పగా నిలబెట్టిన మహనీయుల్లో ఒకరని చిరంజీవి కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రజాప్రతి నిధులు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

వారి ఉద్యోగాలనే క్రమబద్ధీకరించారు. తాజాగా డీఎస్సీ పోస్టుల భర్తీలో ఈ అప్రంటీస్ విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తేవడంతో నిరుద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. తక్షణమే అప్రంటీస్ విధానానికి స్వస్తి పలికి, ఉపాధ్యాయ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

టెట్ కమ్ టీఆర్టీ నోటిఫికేషన్?

టెట్ కమ్ టీఆర్టీ పద్ధతిలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ సిద్ధమైనట్లు సమాచారం. టెట్ కమ్ టీఆర్టీనీ ఒకే పరీక్షను నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం వల్ల అభ్యర్థులకు అన్యాయానికి గురవుతారు. వాస్తవంగా విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) ప్రకారం ఉపాధ్యాయ కోర్సులు బీఎడ్, డీఈడీ, భాషా పండిత కోర్సులు పూర్తి చేసిన వారంతా ఉపాధ్యాయ విద్యార్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధించాలి. అలా అర్హత సాధించిన వారే డీఎస్సీ ద్వారా భర్తీ చేసే టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ)కు దరఖాస్తు చేసేం దుకు అర్హులు. టెట్‌లో 20శాతం మార్కుల వెయిటేజీ ఉంటుంది. ఆ తర్వాత టీఆర్‌టీలో వచ్చిన మార్కులు, టెట్ వెయిటేజీ కలిపి మెరిట్ జాబితాను రూపొందిస్తారు. ఇప్పటికే లక్షలాది మంది టెట్‌లో అర్హత సాధించారు. టెట్, టీఆర్టీ సిలబస్‌లు వేర్వేరుగా ఉంటాయి. టెట్, టీఆర్టీని ఏకకాలంలో నిర్వహించడంతో అభ్యర్థులు ఒత్తిడికి గురవుతారు. నోటిఫికే షన్ ఇచ్చిన 45 రోజుల్లోగా పరీక్ష నిర్వహించాలి. ఈ అతి తక్కువ సమయంలో రెండు పరీక్షల సిలబస్‌లపై అభ్యర్థులు పట్టు సాధించడం అసాధ్యం. గతంలో టెట్‌లో అత్యధిక స్కోరు చేసిన వారికి, ఈ రెండు పరీక్షల్లో స్కోరు ఎలా కేటాయిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు నష్టపోతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టెట్, టీఆర్టీ వేర్వేరుగా నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

నేడు బలపరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఏదైనా ఊహించని పరిణామాలు జరిగితే తప్ప అధికార జేఎంఎం బలపరీక్షలో తేలికగా గెలిచే అవకాశమున్నది. 2022 సెప్టెంబర్‌లో కూడా అవినీతి ఆరోపణల వల్ల హేమంత్ సోరెన్‌పై అనర్హత వేటు పడవచ్చని అంతా భావించారు. ఈ నేపథ్యంలో జేఎంఎం ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కొంది. 48 ఓట్ల మెజారిటీతో విశ్వాస పరీక్షలో హేమంత్ సోరెన్ నెగ్గారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడాలి: దేగా ప్రభాకర్

విశాలాంధ్ర -ఏలూరు: వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రైతులు వ్యవసాయ రంగంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారని, సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వ్యవసాయ రంగాన్ని కాపాడటం కోసం, రైతులకు తక్షణ సహాయం అందే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేదీన రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాల కళ్లు తెరిపించే విధంగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్లో వర్షా భావ పరిస్థితుల వలన పంటలు పూర్తిగా వేయలేదని, కొంతమేరకు పంటలు వేసినా ఆ తరువాత వచ్చిన మిచౌంగ్ తుపాను ప్రభావంతో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పూర్తిగా నష్టపోయి రైతులు ఆర్థిక ఇబ్బందులు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపీఎస్ ముద్దు... సీపీఎస్ వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. ఈ నెల 11న విజయవాడలో 'పాత పెన్షన్ కోసం ఐక్యత ఓటు' పేరిట ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పాత పెన్షన్ విధానాన్ని సాధించేంతవరకు అలుపెరగని పోరాటం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గూమారు శ్రీనివాస్, బందరు దేవుడుబాబు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గురాన శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బత్తిన ప్రసాద్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, రాష్ట్ర మహిళ కౌన్సిలర్ రమాదేవి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు వెంకట రమణ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, మన్యం జిల్లా సీహెచ్ గణపతి, కోనసీమ జిల్లా నుంచి కె.శ్రీను, రాజమండ్రి నుంచి వెంకటేశ్వరరావు, విశాఖ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ శ్యామ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు కె.లీల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రమాదేవి, పి.జగదీశ్, ఇ.ప్రసాద్, కె.దుర్గా ప్రసాద్‌తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సీట్ల సర్దుబాటు కొలిక్కి?

(మొదటిపేజీ తరువాయి)

రాజానగరం స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం విదితమే. మచిలీపట్నం జనసేన ఎంపీ అభ్యర్థిగా బాలశౌరి పోటీ చేసే అవకాశాలున్నాయి. సీట్లు దక్కని వారికి రాబోయే ప్రభుత్వంలో పదవులు, సముచిత స్థానాలను ఇస్తామని హామీ ఇచ్చి బుజ్జగించుకుంటూ ముందుకు పోవాలని నిర్ణయించుకున్నారు. సీట్లు దక్కని వారంతా కొంత త్యాగాలకు సిద్ధమవ్వాలన్న సందేశాన్ని పంపనున్నారు. రెండు పార్టీల మధ్య ఓట్ల బదలాయింపులో నెలకొనే ఇబ్బందులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా ఈ భేటీలో చర్చించారు. దాని కోసం ఉమ్మడిగా మరో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. ఇక చంద్రబాబు, పవన్ వ్యక్తిగతంగా ఒక సీట్లో పోటీ చేయాలా? లేక రెండేసి సీట్లలోనా ? అనే దానిపైనా త్వరలో స్పష్టత రానుంది. ఇప్పటికే అధికార పార్టీ వైసీపీ ఆరు విడతలుగా అసెంబ్లీ, ఎంపీ ఇన్‌చార్జులను ప్రకటించింది. ఏడో జాబితా విడుదలపై కసరత్తు చేస్తోంది. దీంతో టీడీపీ, జనసేన కూటమి కూడా పొత్తులపై స్పష్టతకు వచ్చి, సీట్ల ప్రకటనకు సిద్ధమయ్యాయి. అటు టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు అంశంపైనా తేలాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో బీజేపీ ఎన్నికల కార్యకలాపాల్లో నిమగ్నమైంది. దీంతో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని వాదన ఉంది. అదే సమయంలో జనసేన, బీజేపీ మధ్య పొత్తు కొనసాగుతుందని... టీడీపీతో పొత్తు అంశాన్ని బీజేపీ ఆధిష్ఠానం తేల్చాల్సి ఉందని రాష్ట్ర బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ అంశం కొలిక్కి రాకపోవడంతో టీడీపీ-జనసేన ఉమ్మడిగాను, బీజేపీ ఒంటరిగాను ఎన్నికలకు సిద్ధమయ్యాయి. ఎన్నికలనాటికి ఈ పొత్తులు ఎలా మారతాయనేదీ తేలాల్సి ఉంది.

రైతు రుణమాఫీని అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలి

డిమాండ్ సాధన కోసం
8న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు: రైతులు, కౌలు రైతులకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు ఈనెల 5 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటన చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరయిన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై రూ.2.45 లక్షల అప్పు ఉందని, అందువల్ల పంట రుణాలను, రైతాంగ అప్పులను మాఫీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కరువు, తుపాను వలన నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారంతో పాటు పంటల బీమా పథకం సత్వరం వర్తించేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రాజకీయ పార్టీ రైతాంగానికి ఎకరాకు రూ.15 వేల వంతున పెట్టుబడి సాయం కింద అందించేందుకు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతాంగం ఆత్మహత్యల్లో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉందని, కౌలు రైతులు, రైతులు అత్యధికంగా ఆత్మహత్యలకు గురవుతున్నారని, ప్రభుత్వం రుణాల మాఫీపై అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఈ నెల 8వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో రైతాంగం, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గ్రామీణ బంద్ జయప్రదానికి ఇప్పటికే అనేక రూపాల్లో సన్నాహాలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేసేందుకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, సీనియర్ నాయకులు ముసునూరు రమేష్ బాబు, జిల్లా నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం వెంటనే ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని సంయుక్తంగా నిర్వహించారు. ఈ సమావేశానికి 26 జిల్లాల నుంచి నేతలు హాజరయ్యారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ... ఉద్యోగుల బకాయిల చెల్లింపులో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు కొత్త డిమాండ్లు ఏమీ చేయడం లేదని చెప్పారు. ఏపీఎస్ఆర్టీసీ (పీటీడీ) ఉద్యోగులకు విలీనానికి ముందున్న వైద్య సౌకర్యాలతోపాటు ప్రమోషన్స్, అలవెన్సులు, 2020 నుంచి నిలిచిపోయిన సమస్యల పరిష్కారంలోను తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. 11వ పీఆర్సీ అమలులో ఉద్యోగులకు సరైన న్యాయం జరగలేదని, కొన్ని అంశాల్లో నేటికీ స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లకు నెల వారీ ఈహెచ్ఎస్ కోసం చందాలు వసూలు చేస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి వైద్యం అందటం లేదని, ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, పదవీ విరమణ ప్రయోజనాలను ఏప్రిల్ నాటికి చెల్లిస్తామని చెప్పారని, నేటికీ కోట్ల రూపాయల బకాయిల చెల్లింపులు చేయలేదని వివరించారు. డీఏ, బకాయిలు, సరెండర్ లీవుల విషయంలోనూ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు.

10 అంశాలపై చర్చకు టీడీపీ నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీ సమావేశాల్లో పది అంశాలపై చర్చకు పట్టుపట్టాలని టీడీపీ నిర్ణయించింది. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో ఆదివారం ఆ పార్టీ శాసన సభాపక్షం భేటీ అయింది. అసెంబ్లీ, బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. విశాఖ రైల్వే జోన్‌కు అవసరమైన భూమి అప్పగించకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై చర్చించారు. కరువు మండలాల ప్రకటనలో వైఫల్యం, మిచౌంగ్ తుపాన్ బాధిత రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. వినియోగదారులపై విద్యుత్ చార్జీల బాదుడు, స్థానిక సంస్థల నిధుల దారి మళ్లింపు, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయక పోవడాన్ని సభలో చర్చించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వాటితోపాటు అప్పుల ఊబిలో రాష్ట్రం, సౌర విద్యుత్ ప్రాజెక్టుల పేరిట కొంతమంది బినామీలకు వేలాది ఎకరాల కేటాయింపు, అసంబద్ధ రాయితీలు తదితర అంశాల్ని లేవనెత్తాలని సూచించారు. త్వరలో మూడు స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్నందున అభ్యర్థిని నిలబెట్టే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది.

మహిళల పక్షపాతి సీఎం జగన్

మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర-మెరకముడిదాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాం గ్రామంలో నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి మంత్రి బొత్స నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు, ప్రతీ కుటుంబం సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడతగా 1,289 మహిళా సంఘాలకు 10,39,46,988 రూపాయలను నేరుగా మహిళల ఖాతాలో జమ చేయటం జరిగిందని తెలిపారు. మహిళలను రుణభారం నుంచి విముక్తి చేయాలన్న సంకల్పంతో వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. 2014 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఒకటి కూడా నెరవేర్చలేదని, అయితే 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నూటికి నూరు శాతం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని తెలిపారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా అవినీతి రహిత పాలన అందిస్తున్న ఘనత వైఎస్సీపీ ప్రభుత్వానిదని అన్నారు. గత ప్రభుత్వాల పాలనకు వైఎస్సీపీ ప్రభుత్వ పాలనకు తేడా గుర్తించాలని మహిళలను కోరారు. నాడు-నేడు పథకం క్రింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల సౌకర్యాలతో ఏర్పాటు చేస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలన్న గొప్ప లక్ష్యంతో జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. విజయనగరం పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రిదేనని అన్నారు. రెండు, మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ప్రతిపక్ష పార్టీలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని హితవు పలికారు. లబ్ధి పొందిన ప్రతి మహిళా జగనన్నకు అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం 1,289 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10,39,46,988 రూపాయల చెక్కును మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, సహదిత్ వెంకట త్రినాథ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్డీఓ బి.శాంతి, ఎంపీడీవో ఎం.పావని, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీడీ సావిత్రి, మండలాధ్యక్షురాలు తాడ్డి కృష్ణవేణి, స్థానిక సర్పంచ్ జి.గాయత్రీదేవి, వైఎస్సీపీ మండల నాయకులు తాడ్డి వేణుగోపాల రావు, కోట్ల వెంకటరావు, శిరుపూరి వెంకటరమణ రాజు, సత్తారు జగన్మోహన్ రావు, బి.నరేష్, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, తాడ్డి చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం ఉమా మహేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అత్యంత కిరాతకంగా తహసీల్దార్ రమణయ్య హత్యకు గురైన సంఘటన రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులను భయాందోళనకు గురిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఆదివారం విజయవాడ రెవెన్యూ భవన్ లో తహసీల్దార్ రమణయ్య చిత్రపటానికి రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. బొప్పరాజు మాట్లాడుతూ చనిపోయిన రమణయ్య కుటుంబానికి తక్షణమే ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయన భార్యకు గ్రూప్ 2 స్థాయి ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రభుత్వ భూముల రక్షణ, భూ సంబంధిత అంశాల పరిష్కారంలో నిత్యం తలమునకలయ్యే రెవెన్యూ ఉద్యోగులకు మానసిక ధైర్యం, నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రెవెన్యూ ఉద్యోగులందరూ ఇతర జిల్లాలకు వెళ్లి ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో, ఇలాంటి దారుణ సంఘటనలు పునరావృతం కాకుండా, ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందో తక్షణమే చెప్పాలన్నారు. అధిక భూవివాదాలు ఉన్న మండలాల తహసీల్దార్లకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఆటంకాలు కలగజేయడం, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

రవీంద్రనాథ్

విశాలాంధ్ర-బేస్తవారిపేట: సమ్మె కాలంలో అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ప్రభుత్వం జరిపిన చర్చల్లో భాగంగా అంగన్‌వాడీలకు సమ్మె కాలానికి జీతం చెల్లింపు, పోలీసు కేసుల ఎత్తివేత వంటి హామీలు ఇచ్చారని, ఆ హామీలను అమలుపరచకుండా దానికి భిన్నంగా కొత్త జీవోలు తీసుకువచ్చారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అటువంటి జీవోలను సవరణ చేసి అంగన్‌వాడీలకు సమ్మెకాలానికి జీతంతో పాటు పోలీసు కేసుల ఎత్తివేతకు సంబంధించి జీవోలు విడుదల చేసి ఒప్పందాలను తప్పకుండా అమలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. సమ్మె సమయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవాల్సి వచ్చిందని, ఆ దీక్షను ప్రభుత్వం భగ్నం చేసిందని తెలిపారు. ఆ నిరాహార దీక్షలో బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ బి.పేట మండల అధ్యక్షురాలు సరళ పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. అన్నిరోజుల తట్టుకొని 42 రోజులు సమ్మె చేసిన అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనేక మందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత, జిల్లా అధ్యక్షురాలు రేణుక, పార్వతి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఇబ్రహీం, గౌరవాధ్యక్షులు అన్వర్ బాషా, నాయకులు ఖాసీం, అర్జీవీడు, బేస్తవారిపేట, కంభం మండలాల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగ ఖాళీల భర్తీకి కృషి

ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర సంఘం అధ్యక్షులు
బండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగాల పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి పని భారం తగ్గించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో జరిగిన రాష్ట్ర నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్జీవో అసోసియేషన్ స్థాపించిన నాటి నుంచి నాల్గవ తరగతి ఉద్యోగులకు తమవెంటే ఉండటం అభినందనీయమన్నారు. తమ రెండు సంఘాలదీ తల్లీపిల్లల అనుబంధమని అభివర్ణించారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో చిరు ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు ఉద్యోగుల వ్యవహారించిన రాష్ట్ర అధ్యక్షులు చదువుల గోపాలకృష్ణ సంఘానికి అందించిన సేవలు మరువలేనివని, ఉద్యోగ పదవీ విరమణ అనంతరం జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాయకులు ప్రతి ఉద్యోగిని కలుపుకుపోవాలన్నారు. ఎప్పుడు ఎటువంటి సమస్య వచ్చినా ఎన్జీవో సంఘం మీకు అండగా ఉంటుందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆందోళన బాట పడదామన్నారు. ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ సమస్య ఉన్న ప్రతి ఉద్యోగికి నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అండగా నిలవాలన్నారు. రాష్ట్రస్థాయి పదవులు నిర్వహించడం కత్తి మీద సాము లాంటిదన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్షత్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను ఈ పదవి ద్వారా ప్రతి ఉద్యోగికి అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం సంతృప్త స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. తొలినుంచి నాల్గవ తరగతి ఉద్యోగులకు అండదండలు అందిస్తున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఏపీ ఎన్జీవోస్ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల మనం స్పందించే లక్షణమే మనల్ని మంచి నాయకుడిగా తీర్చిదిద్దుతుందని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవోస్ ఎప్పుడూ అండగా ఉంటారని హామీ ఇచ్చారు. రాష్ట్ర స్థాయి నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా పోటుగా వి.ఎస్.సాయిరాం సహాధ్యక్షులు, బి.వి.రమణారెడ్డి ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. మాజీ అధ్యక్షులు చదువుల గోపాలకృష్ణను ఎన్జీవో, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్షరంతో అభిమానుల్ని సంపాదించిన చక్రధర్

చక్రవాకం పుస్తకావిష్కరణలో వక్తలు

విశాలాంధ్ర - అమలాపురం: తెలుగు సాహిత్యంలో తన అక్షరంతో అభిమానుల్ని సంపాదించుకున్న గొప్ప రచయిత, కథకుడు ముక్కామల చక్రధర్ అని శ్వేత టీటీడీ డైరెక్టర్ ప్రొఫెసర్ భూమన్ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ హాల్లో ముక్కామల చక్రధర్ రాసిన చక్రవాకం పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కేరాఫ్ కూచిమంచి అగ్రహారం ద్వారా విశేష కృషి, అభిమానాన్ని సంపాదించిన చక్రధర్ తన చక్రవాకం ద్వారా మరింతమంది అభిమానుల్ని సంపాదించారని కొనియాడారు. విశాలాంధ్ర దినపత్రికలో ప్రతి శనివారం ప్రచురితమయ్యే ముక్కామల చక్రధర రాసిన చక్రవాకం కాలం సంకలనాన్ని భూమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్రధర్ కథనంలో నిజాయితీ కనపడుతుందని, తాను నమ్మిన విషయాన్ని అంతే నమ్మకంతో అక్షరబద్ధం చేశారని అన్నారు. ముఖ్యఅతిథి శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ ఉప కులపతి కుసుమ కుమారి మాట్లాడుతూ చక్రధర రాసే ప్రతి కాలం ఆలోచింప చేసేదిగా ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి ప్రసన్న మాట్లాడుతూ చక్రధర రచనల్లో వ్యంగ్యం కొట్టడం కాదు చదువరుల్ని పొడిచేస్తుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ సిహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ వాక్యాన్ని చిన్నచిన్న పదాలతో ఎంతో అర్థవంతంగా రాయటం చక్రధర శైలి అన్నారు. ఈ సందర్భంగా ముక్కామల చక్రధర్ తన అక్క కూచిమంచి శ్యామల దేవిని ఘనంగా సన్మానించారు.

డీఎస్సీ ప్రకటన మోసపూరితం : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మెగా డీఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నారని, తక్షణమే ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులకు ప్రకటన విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ అమలు చేస్తారని ఎదురు చూసిన వారికి తాజా డీఎస్సీ ప్రకటన నిరాశ పరిచిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 30వేలకుపైగా ఉపాధ్యాయ ఖాళీలున్నప్పటికీ, కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసగించడమేనన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర సందర్భంగా వైఎస్సీపీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటించి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దానిపై నిరుద్యోగ యువత ఎంతో నమ్మకం పెట్టుకుందని, సుదీర్ఘకాలంగా యువజన, విద్యార్థి సంఘాల పోరాట ఫలితంగా 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించారన్నారు. వాటిని అన్ని జిల్లాలు, కేటగిరీలను సమగ్రంగా రూపొందించలేదని విమర్శించారు. ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటిస్ విధానాన్ని ప్రకటించడం అన్యాయమన్నారు. తక్షణమే 30వేలకుపైగా ఖాళీగా ఉన్న పోస్టులతో జంబో డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎంఆఓ-1లకు డ్రాయింగ్ పవర్స్ కల్పించాలి

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

విశాలాంధ్ర, పార్వతీపురం: మండల విద్యాశాఖ అధికారి-1 లకు తమ జీతభత్యాలను డ్రా చేసుకునేందుకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని ఎంఈఓ-1 అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనికి సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్‌కు లేఖ ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. జీఓ నంబర్ 89 ప్రకారం ఎంఈఓ -1, ఎంఈఓ-2 లకు స్పష్టమైన జాబ్‌చార్ట్‌ను విడుదల చేసినప్పటికీ, చాలా జిల్లాల్లో డీఈఓలు.. ఎంఈఓ-1లకు అన్ని రకాల విధులు నిర్వర్తించాలని ఆదేశిస్తుండటంతో పని ఒత్తిడి అధికమవుతోందని అన్నారు. జాబ్‌చార్ట్ మేరకు విధులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎంఆర్సీ కార్యాలయాల నిర్వహణ ఖర్చులు ఈ ఏడాది ఇంతవరకు విడుదల చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్వహణ ఖర్చులు పెరిగిన దృష్ట్యా కార్యాలయ గ్రాంట్‌ను రూ. రెండు లక్షలకు పెంపుదల చేయాలని కోరారు. ఈ విషయాలన్నిటినీ కమిషనర్ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

ఎన్నెన్నో అనుమానాలు...

ఓ కీలక రాజకీయ నేత ఉన్నట్లు ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విశాఖలో తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కన్వేయన్స్ డీడ్ వ్యవహారమే ఈ హత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు సుబ్రహ్మణ్యం గంగారాంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఐటీ హిల్స్ సమీపంలో ఉన్న జ్యువెల్ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఫ్లాట్ వ్యవహారమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కీలక రాజకీయ నేత హస్తముందని ప్రచారం సాగుతోంది. పోలీసులు కూడా అంతకీ ఆదిశాలో స్పందిస్తున్నారని, తెర వెనుక ఉన్న రాజకీయ నేతను తప్పించే ప్రయత్నం చేస్తున్నాయని మరోవైపు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న తహసీల్దార్ రమణయ్యను అతి దారుణంగా ఇంటికి వచ్చి మరీ ఆగంతకుడు హతమార్చి దర్జాగా వెళ్లిపోయాడు. ఈ దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆగంతకుడితో తహసీల్దార్ కొంతసేపు వాగ్వాదం జరిపినట్లు కూడా ఫుటేజీలో కనిపిస్తోంది. ఒక్కసారిగా రాడ్‌తో ఎమ్మార్వోపై దాడి చేసి హతుడు పరారయ్యాడు. చీపురుపల్లిలో ఉన్న ఎకరాల ల్యాండ్ వ్యవహారమేంటి అనే అంశంపై విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఈ హత్యపై రమణయ్య సోదరుడు రాజేంద్ర స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ చీపురుపల్లిలో ఏడు ఎకరాల ల్యాండ్ కోసం కొంతకాలంగా తమని చంపేస్తామని బ్రోకర్ ప్రసాద్ బెదిరిస్తూ వచ్చినట్లు చెప్పారు. ఈ హత్య ఘటనపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేయడం, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ధర్నాకు దిగడంతో పోలీసులు ఒత్తిడికి లోనై ఒకే కోణంలో కేసును పూర్తి చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ అంశంతో ఎమ్మార్వో రమణయ్య హత్యకు దారితీసినట్లు సీపీ రవిశంకర్ చెప్పారు. నిందితుడు ఎమ్మార్వో ఆఫీసుకు కూడా వెళ్లినట్లు గుర్తించామని, సీసీటీవీ ఫుటేజ్ కూడా దొరికిందన్నారు. ఘటన తర్వాత నిందితుడు ఎయిర్‌పోర్టు వైపు వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో తేలిందని, రైల్వే టికెట్లు కూడా బుక్ చేశాడని సీపీ రవిశంకర్ చెప్పడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నిందితుడి కోసం పోలీసులు బృందాలు గాలింపు చేపడుతున్నారు. బెదిరింపులు, కిడ్నాప్‌లతో ఇప్పటికే వణికిపోతున్న విశాఖ వాసులను ఈ హత్య ఘటన నివ్వెరపరిచింది. రాజధానిగా ప్రభుత్వ పెద్దలు ప్రకటించి చేసుకుంటున్న విశాఖలో ఒక ప్రభుత్వ ఉద్యోగిని ఆయన ఇంటి వద్దే హతమార్చిన తీరు సర్వత్రా భయభ్రాంతులకు గురిచేసింది. భద్రత విషయంలో జనం, వ్యాపారులు భయపడే పరిస్థితిని కల్పించింది. ఐరెక్ట్ క్రితం వరకు విశాఖ ప్రశాంత నగరం. కానీ ఇప్పుడు కల్లోల నగరంగా మారడం విశాఖ వాసులను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక నాయకుడి సాహిత్య సేవ

సాహితి

తెలుగునాట ప్రసిద్ధులైన నలుగురు కార్మిక నాయకులు - డా. రాజ్ బహదూర్ గౌర్, కె.ఎల్. మహేంద్ర, వై. విజయకుమార్, ఎం.వి.ఎస్. కపర్ది మధ్య ఓ సామ్యం ఉంది. ఈ నలుగురూ అధ్యయనశీలురు. అపారమైన సాహిత్యాభిమానం, అభినివేశం ఉన్నవారు. కపర్దిని మినహాయిస్తే మిగతా ముగ్గురూ విస్తారంగా రాసినవారు. డా. రాజ్ బహదూర్‌గౌర్ అయితే ఉర్దూలో అత్యంతప్రసిద్ధుడైన సాహిత్య విమర్శకుడు. ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో పేరున్న రచయిత. మహేంద్ర కూడా మూడు గ్రంథాలు రాశారు. కపర్ది పత్రికల్లో అనేక వ్యాసాలు రాశారు కాని అవేవీ గ్రంథస్థం కాలేదు. వై విజయ కుమార్ చిన్నవే అయినా నాలుగైదు గ్రంథాలు రాశారు. రాజ్ బహదూర్‌గౌర్, మహేంద్ర నిజాం హయాంలో హైదరాబాద్ సంస్థానంలో మఖ్దూంతో కలిసి కార్మికోద్యమానికి, కార్మిక సంఘాలకు బీజం వేసిన వారు. ఏ.ఐ.టి.యు.సి. నాయకులుగా ప్రసిద్ధులు. కపర్ది, వై. విజయకుమార్ కోస్తా ఆంధ్ర ప్రాంతంలో అదే పని చేశారు. అనేక కార్మిక సంఘాల స్థాపనకు ఆద్యులు. వీరందరికీ ఉన్న మరో సామ్యం స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు కావడం. రాజ్‌బహదూర్, మహేంద్ర మాతృ భాష తెలుగు కాకపోయినా తెలుగు సాహిత్య ఆనుపానులు తెలిసిన వారు.

వై. విజయకుమార్ 1918 సెప్టెంబర్ 15న గుంటూరు జిల్లా పాత తెనాలి తాలూకా, ప్రస్తుతం అమృతలూరు మండలంలోని తురిమెళ్ల గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి యలమంచిలి రాఘవయ్య 12 భాషల్లో పండితులు. అందుకే విజయ కుమార్‌కు గ్రంథపఠనం వారసత్వంగా అబ్బినసుగుణం. ఆయన 1934లో మెట్రిక్యులేషన్‌లో అద్వితీయంగా నిలిచారు. 1929-30 నాటి అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం వారి కుటుంబాన్ని కూడా కుదేలు చేసింది. తండ్రి విధిలేక చదువు మాన్పించారు. అందువల్ల విజయకుమార్ ఉన్న ఊళ్లోనే గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలన్నీ చదివేశారు. 1931లో భగత్‌సింగ్‌ను ఉరితీయడం ఆ నాటి యువతరాన్ని కలచి వేసింది. ఆ సమయంలోనే 1935లో విజయ కుమార్‌కు కమ్యూనిస్టు పార్టీతో సంబంధం ఏర్పడింది. మార్క్సిస్టు గ్రంథాల అధ్యయనం నిత్యకృత్యమైంది. సాహిత్యం మీద అభిరుచి ఉన్నందువల్ల 1937లో నవ్య సాహిత్య పరిషత్తులో చేరారు.

పై చదువులకు ఆర్థిక స్తోమత లేనందువల్ల విజయనగరం మహారాజా కళాశాలలో ఉచిత భోజన సదుపాయం, ఉపకార వేతనం ఉంటాయని తెలిసి విజయకుమార్ అక్కడికెళ్లి బి.ఎస్సీలో చేరారు. విజయనగరంలోనే శ్రీ శ్రీ, శ్రీ రంగం నారాయణబాబు, చాగంటి సోమయాజులు, సెట్టి ఈశ్వర రావు, అవసరాల సూర్యా రావుతో పరిచయం కలిగింది. వారి సాహచర్యం వల్ల తన సాహితీ జిజ్ఞాసకు పదునుపెట్టుకోగలిగారు. విజయ కుమార్ వారికి రాజకీయ, ఆర్థిక శాస్త్రాల గురించి చెప్పే వారు. అప్పటికే ఆయనకు మార్క్సిస్టు సాహిత్యంతో సంబంధం ఉంది కనక సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథంతో జోడించి తెలియజేసేవారు. ఈ అలవాటే ఆయన మార్క్సిజం అధ్యాపకుడిగా, సాహిత్య విమర్శరంగంలో కృషి చేయడానికి దారి తీసింది.

ఆయన బి.ఎస్సీ. చివరిరోజు పరీక్షరాసే నాటికి పోలీసులు అరెస్టు చేయడానికి కళాశాల వద్ద కాచుకు కూర్చున్నారు. పరీక్ష పూర్తి అయ్యేంతవరకు ప్రిన్సిపాల్ పోలీసులను లోపలికి అడుగు పెట్టనివ్వలేదు. పరీక్షరాసేసి మరుగుదొడ్ల మీంచి గోడ దూకేసి, గోడ అవతల మిత్రులు భద్రమూర్తిశర్మ లాంటి వారు ఏర్పాటుచేసిన నిచ్చెన దిగి చక్కా తప్పించుకుపోయారు. కానీ నాగరత్నమ్మతో పెళ్లిఅయిన వెంటనే అరెస్టు తప్పలేదు. కొత్త పెళ్లికొడుకు తొమ్మిదినెలలు జైలులో గడపవలసి వచ్చింది.

ఆయన డిగ్రీ చదువు విజయనగరంలో సాగింది కనక కార్మిక నాయకుడిగా ఆయన కార్యరంగం కూడా ఉత్తరాంధ్రే అయింది. విశాఖపట్నంలో ఓడ రేవు, షిప్ యార్డు, చిట్టివలస జనపనార మిల్లు మొదలైన చోట్ల కార్మిక సంఘాలను ఏర్పాటు చేసిన ఆద్యుల్లో ఆయనా ఉన్నారు. ఆ తర్వాత విశాఖ ఉక్కు కర్మాగారంవంటి చోట కార్మికోద్యమాలు నడిపారు. సంఘాలు పెట్టారు. మార్క్సిజం మీద ఉన్న అభిరుచి కారణంగా మౌలికమైన మార్క్సిస్టు తత్వశాస్త్ర గ్రంథాలు అనువదించారు. అయితే ఆయన అనువాదకుడైంది అవసరం కోసమే. రచన ఆయన తత్వం. ఆయన స్వతంత్ర రచనలన్నీ సాహిత్య విమర్శకు సంబంధించినవే. "సాహిత్యం-వాస్తవికత: మార్క్సిస్టు పరిశీలన", "సాహిత్యం-మానవుడు", "సాహిత్య సమాలోచన", "సాహిత్యాభ్యుదయం" వంటివి సాహిత్య విమర్శకుడిగా ఆయన పరిజ్ఞానానికి నిదర్శనాలు. సాహిత్యం వాస్తవికత గ్రంథం ప్రాచీన సాహిత్యంలో వాస్తవ చిత్రణ ఎలా ఉండేదో వివరిస్తూ సోషలిస్టు వాస్తవికత దాకా క్రమ పరిణామాన్ని సాధికారికంగా, అనేక ఉదాహరణలతో వివరించారు. ఆయన సాహితీకృషి ప్రఖ్యాతం కాకపోవచ్చు. కాని 'నివురుగప్పిన నిప్పులా' చివరిదాకా కొనసాగించారు.

విజయ కుమార్ రచనలు రాశిలో తక్కువే. వాసిలో నిరుపమానాలు. ఆయన రాసినదానితో పోలిస్తే చదివింది అపారం. తెలుగులోనే కాక భిన్నభాషల్లో ప్రాచీన సాహిత్యం చదివేయడం కాదు అధ్యయనం చేశారు. ఇంగ్లీషు రచయితలనే కాక ప్రసిద్ధ జర్మన్, ఫ్రెంచి రచయితల గ్రంథాలూ చదివారు. రష్యన్ సాహిత్యం సరే సరి. విజయ కుమార్ లో ఉన్న విశిష్టత ఏమిటంటే ప్రామాణిక గ్రంథాలను ఎంతగా చదివారో ఇంగ్లీషులో వచ్చిన "తుక్కు" సాహిత్యం కూడా అలాగే చదివారు. అర్థర్ హేలీ, సిడ్నీ షెల్డాన్ వంటి ఉబుసుపోక రచయితల నవలలన్నీ చదివేశారు. కార్మిక నాయకుడిగా విపరీతంగా తిరగాల్సి వచ్చేది కనక ప్రయాణంలో ఆయన ప్రధాన వ్యాపకం ఏదో ఒక పుస్తకం చదవడమే.

ఎవరికైనా ప్రాపంచిక దృక్పథం ఉండాలి. రచయితలకు ఇదీ మరీ ముఖ్యం. సాహిత్యం చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చిత్రిస్తుంది కనక సాహితీవేత్తలకు నిర్దిష్టమైన ప్రాపంచిక దృక్పథం ఉండాలి. అది సామాజిక పురోగమనానికి తోడ్పడితే ఆ దృక్పథానికి సార్థకత. విజయ కుమార్ సాహిత్య దృక్పథం నిర్దిష్టమైంది. అది మార్క్సిస్టు దృక్పథం. అందుకే సాహిత్యం వాస్తవికత గ్రంథంలో "తోలుస్తాయ్, చెహోవ్ పాత్రలు మంచి భవిష్యత్తును గురించి కలలుగంటాయి. గోర్కీ పాత్రలు మంచి భవిష్యత్తును పోరాడి సాధిస్తామని శపథం చేస్తాయి" అని సవిమర్శక వాస్తవికతకు, సోషలిస్టు వాస్తవికతకు ఉన్న తేడా వింగడించగలిగారు.

ఎంత గొప్ప రచయితలైనా, లబ్ధ ప్రతిష్ఠితులు అయిన రచయితలైనా సిద్ధాంత బలిమి లేకపోతే అలవోకగా తప్పుడు సూత్రీకరణలు చేస్తారు. రూపానికి, సారానికి గల తేడాను, సమన్వయాన్ని, పాటించవలసిన సంయమాన్ని విస్మరిస్తారు. ఈ కారణంగానే "పద్యం ఫ్యూడలిజానికి, గేయం కాపిటలిజానికి, వచనం సోషలిజానికి అనువైన రూపాలు" అని శ్రీ శ్రీ చేసిన సూత్రీకరణలోని లోపం ఏమిటో విజయకుమార్ ఎత్తి చూపారు. విప్లవ కాల్పనికతకు, కాల్పనిక విప్లవ ధోరణికి మధ్య తేడాను వివరించగలిగారు. ప్రతీకవాదం పిల్లిమొగ్గలు వేసిన క్రమాన్ని ఈసడిస్తూనే పురోగమనవాద సాహిత్యానికి ప్రతీకలు ఎంత ప్రధానమో విడమర్చి చెప్పారు.

అక్టోబర్ విప్లవం తర్వాత మైకోవ్ స్కీ వంటి మహా రచయితలే ఫ్యూచరిజం, ప్రోలెట్ కల్ట్ ప్రభావానికి లోనై పెడదోవ పట్టినప్పుడు లెనిన్ ఈ పెడ ధోరణులను నిశితంగా విమర్శించిన వైనాన్ని తెలియ జేసి వర్తమాన రచయితలకూ మార్గదర్శనం చేశారు. కొత్తదనం లేనిది కళ కాదు అని టి.ఎస్. ఇలియట్ చెప్పిన మాటను ఉటంకిస్తూనే కొత్తదనం పేరుతో వెర్రి రూపవాదం, వికృత రూపాలు, వ్యర్థ ప్రయోగాలు అభ్యుదయవాదం కాదని హెచ్చరించారు.

మానవుడి గురించి విజయ కుమార్ ప్రస్తావించిన రచయితల జాబితా చూస్తే ఆయన అధ్యయనం ఎంత లోతైందో తెలుస్తుంది. జాన్ డ్యూయీ "మానవుల సమస్యలు", దాగోబర్ట్ డి.రూనే "మానవ స్వభావం", విలియం బారెట్స్ "నిర్హేతుక మానవుడు" వెస్ట్ బ్రూక్ "మానవుని గొప్పతనం", డి.డన్ హాం "కల్పనకు వ్యతిరేకంగా మానవుడు" మొదలైన అనేక గ్రంథాలు "సాహిత్యం మానవుడు" పుస్తకంలో ప్రస్తావించారు. ఆధునిక సమాజంలో సాహిత్యంలో, కళల్లో వ్యక్తమవుతున్న పరాయీకరణ ఎంత అపకారం చేస్తుందో చెప్తూ ఉన్న అస్తవ్యస్త పరిస్థితిని మార్చడానికి పోరాడడం మనిషి లక్ష్యం కావాలి కాని నిర్వేదంలోకి జారిపోకూడదని హెచ్చరిస్తారు.

తెలిసో తెలియకో పెట్టుబడిదారీ సమాజాన్ని సమర్థించే రచయితలందరినీ విజయకుమార్ గుడ్డిగా విమర్శించరు. వారిలో ఉన్న సైద్ధాంతిక అవగాహనా లోపాన్ని ఎత్తి చూపుతూనే వారిలోనూ ఉత్తమ రచయితలు ఉన్న వాస్తవాన్ని సోదాహరణంగా బయట పెడ్తారు. ఎర్నెస్ట్ హెమింగ్వే "ఫర్ హూం ది బెల్ టాల్స్" లో "మానవుడు ఒంటరిగా లేడు, నేటి పరిస్థితుల్లో మానవుడు ఒంటరిగా ఉండాలనుకోవడం అసాధ్యం. ఒంటరి మానవుడు ఎందుకూ కొరగాడు" అన్న పంక్తులు ఉటంకించి పరాయీకరణవల్ల ప్రమాదాన్ని, సమష్టి తత్వం విశిష్టతను గుర్తు చేస్తారు. మరో నవలలో హెమింగ్వే "మానవుడు అపజయాన్ని పొందేందుకు సృష్టించబడలేదు. మానవుని ధ్వంసం చేయడం సాధ్యం కాదు. అతనిని లేకుండా చేయడం ఎవరి వల్లా కాదు" అని చెప్పించిన వైనాన్ని గుర్తు చేయడంలో విజయకుమార్ ఆశావహ దృక్పథం నిగ్గుదేరి కనిపిస్తుంది. మరో అడుగు ముందుకేసి "మానవుడి పాట్లు" నవలలో షోలకోవ్ రాసిన "ఎన్ని కష్టాలు వచ్చినా సహించి, భరించి వాటిని అధిగమించగల మానవుని సంకల్పంలోనూ తుది విజయంలోనూ విశ్వాసం కలిగి ఉండడం, ప్రపంచాన్ని మార్చవలసిన అవసరాన్ని గుర్తించడం, అలాంటి మార్పుకు సమష్టి శ్రమే ఏకైక సాధనమని తెలుసుకోవడం ఒక్కటే సమకాలిక పరిస్థితుల్లో సాహిత్యాభివృద్ధికి పునాది" అన్న వాక్యాలను గుర్తు చేయడం భవిష్యత్తు మీద విజయకుమార్‌కు ఉన్న అమితమైన విశ్వాసానికి సంకేతం.

విచిత్రం ఏంటంటే షోలకోవ్ చెప్పినా, విజయకుమార్ ఉటంకించినా పరిస్థితి ఇప్పటికీ మారలేదు. మారిందనుకున్న చోట మిగిలిందల్లా శిథిలాలే. విజయకుమార్ సి.పి.ఐ. నాయకుడైనా, అభ్యుదయ రచయితలకు పెద్ద దిక్కు ఐనా ప్రగతిశీల భావాలు ఉన్న వారందరి ఐక్యతే అంతిమ పరిష్కారం అని చెప్పే వారు. ఆ ఆశా నెరవేరనే లేదు. అనివార్యమైన ఈ అవసరాన్ని గుర్తించి లక్ష్య సాధన దిశగా ఐక్యంగా ముందుకు సాగవలసిన కర్తవ్యం మన మీదే ఉంది.

- భరద్వాజ

ఓ కొంగొత్త ఆవిష్కరణ!

ఒకానొక రోజు తెలియని
అసంబద్ధ సందిగ్ధంలో ముడుచుకుపోయి
ఓ విప్లవ మూలన కూర్చున్నప్పుడు...
చీకట్లో మసక ఎరుపు వెలుతురులో
ఆ గదిలోని ఓజోన్ ఖాళీలోకి
తనలోని అరణ్యాల అతలాకుతలం
అంతా జొరబడి...
అదృశ్య వాస్తవాధీన రేఖలను
ఒకదానికొకటి ఢీకొనే
క్లిష్టమైన నగ్న ఆకారాల
పగిలిన చేనేత అల్లికలను నింపి...
ఊహాచిత్రంలో-
ఒక అల్ట్రావయోలెట్ గీతల
ఊచకోతల కేయాస్‌ను
ముద్రపరుస్తుంది!

గుట్టలు గుట్టలుగా-
దారాల చిక్కుముళ్ళ జాలం
చీకట్లో రేడియంలా కనిపిస్తే గనక
విభిన్న వికృత సంస్కృతుల
ఎలుకల ప్రపంచం ఎలా వుంటుందో...
అలా పసలేని మాటలను కూడా
అధివాస్తవికంగానే చూస్తున్నాడతను!
అంతేగాక... తనని తాను కూడా
ఒక త్రిమితీయ ఆయామంలో
పారదర్శకంగా... తన బానిస చర్మాన్ని
లోపలి వ్యాపార అవయవాలను
అనుకరించే నరాలను ఎముకలను
గతచరిత్ర గాఢ కళేబరాలను కూడా
తీసి ఆరబెడుతున్నాడు!

కరెన్సీ సమయాన్ని-
గోడమీంచి దోసిట్లోకి బంధించి ఆపబోతే...
లిక్విడ్ మెర్క్యురీ ఒక తలంపై దొర్లినట్టే
ఓ పట్టాన చిక్కట్లేదు!
స్పృహతో బతకడానికే కదా
ఈ పోరాటాల లోకంలోకి మనం
రక్తపు మడుగులోంచి చొచ్చుకుని వచ్చింది..!
అయ్యో..!!
తన కన్స్యూమర్ మెదడులోని
కలగాపులగపు ఆలోచనల పొరలను
రూబిక్స్ క్యూబ్ ను సాల్వ్ చేసినట్టే ఏకాగ్రతతో
యాంత్రికంగా కూరుస్తున్నాడు..!
రేపో మాపో అందులోంచే
ఓ కొంగొత్త ఆవిష్కరణను వెలికితీస్తాడా
ఈ వినూత్న మానవుడు
"మానవత్వం" ఏమాత్రం మరవక..!!?

- రవీర్, 9603245215

స్వేచ్ఛ మరణిస్తే

నడకలులేని నడతల మధ్య
అడుగులు కొలవని దూరాల మధ్య
కుదించిన స్వేచ్ఛ మధ్య
విశాల చరణమై
రాత్రిని రాత్రిగా
పగలును పగలుగా చూపుతూ
నిండు స్వేచ్ఛను నిర్మించాను
ఎవరో సంకెళ్ళువేసి
నన్ను రసాతలంలోకి లాగుతున్నారు!
కళ్ళు పైకెత్తని చూపు
పాదాలచుట్టూ పరిభ్రమిస్తూ
భయకంపిత చిత్తంతో
నలుదిక్కులు చూడని కళ్ళమధ్య
విస్తరించిన దృష్టితో
పిరికిచూపుకు ధైర్యం అంటుకట్టి
పచ్చనిచూపుల క్షేత్రం సిద్ధమైంది
ఎవరో గంతలుకట్టి
నన్ను తలాతలంలో బంధీ చేశారు!
పాట గొంతులో దాగి
మాటను స్వేచ్ఛ ముద్దచేస్తే
గొంతెత్తిన నామాట గానం
మేల్కొల్పుల జడివానై
పల్లవించిన అన్ని గొంతులు
చైతన్యానికి సుగమం
ఎవరో మూతికి చిక్కంగట్టి
నన్ను పాతాళానికి తీస్తున్నారు!
పరాక్రమ విక్రమహస్తాలు
నిరుద్యోగులయ్యాయి
స్వేచ్ఛ కర్తల్ని
భుజం మార్చుకోమంటూంది
నిరాశ ప్రతిధ్వనిస్తుంటే
కథ అర్థమై కార్యనిర్వాహకుణ్ణై
సమస్యల్ని బండికెక్కించి చక్రం తిప్పాను
ఎవరో బేడీలువేసి
నన్ను మహాతలానికి మళ్ళించారు!
నేనెన్నుకున్న ప్రభుత్వం నన్నేలుతూంది
స్వేచ్ఛ బతికితే పాలకులు బంధీ
స్వేచ్ఛ మరణిస్తే ప్రజలు ఖైదీ!

అడిగోపుల వెంకటరత్నం
సెల్: 98482 52946

ఆరుగురు ప్రధానుల కలం బొమ్మలు

మంచి పుస్తకం

ఆర్వీ రామారావ్

ఎనిమిది మంది ప్రధానమంత్రుల పని తీరు, పది లోక సభ ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన ఏ పత్రికా రచయిత అనుభవాలైనా సుసంపన్నంగానే ఉంటాయి. నీరజా చక్రవర్తి నాలుగు దశాబ్దాల పై చిలుకు అనుభవం ఉన్న పత్రికా రచయిత్రి. ఆమె ప్రధానంగా రాజకీయ పరిణామాల గురించిన వార్తలే రాసిన వారు. దిల్లీలో పని చేసినందువల్ల ప్రధానమంత్రులను, కేంద్ర పరిపాలనా వ్యవస్థను, వివిధ నాయకుల నడవడికను, మనస్తత్వాలను గమనించే అవకాశం ఆమెకు దక్కడం సహజమే. గత సంవత్సరం నీరజా చౌదరి "హౌ ది ప్రైం మినిస్టర్స్ డిసైడ్" గ్రంథం వెలువరించారు. ఆమె ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, పీవీ నరసింహా రావు, అటల్ బిహారీ వాజపేయి, మన్‌మోహన్ సింగ్ పరిపాలనా రీతిని దగ్గరి నుంచి పరిశీలించారు. అంటే ఇందిరా గాంధీ పాలన మొదలుకుని మోదీ పాలనకు ముందున్న ప్రధాన మంత్రులలో ఆరుగురి గురించిన వ్యవహార రీతిని ఈ గ్రంథంలో వివరించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు అధికారంలో ఉన్నా ఆ ప్రభుత్వాలు, మంత్రివర్గాలు అంతిమంగా పార్లమెంటుకు జవాబుదారుగా ఉండాలి. కానీ నడుస్తున్న చరిత్రను చూస్తే ప్రధానమంత్రి స్థానంలో ఉన్న వారే సర్వం చక్కబెడ్తున్నట్టు కనిపిస్తుంది. ఇందిరా గాంధీ హయాం నుంచి ఈ ధోరణి కొనసాగుతోంది. ప్రధానమంత్రులు దేశ ప్రతినిధులుగా మారిపోయారు. మిగతా మంత్రులు గట్రా నిగమ శర్మ అక్కలే. పత్రికా రచన నిష్పక్షపాతంగా ఉండాలంటారు. నిజానికి అది సాధ్యమయ్యే పని కాదు. మంచిని సమర్థించాలనుకున్నప్పుడు ఆ మంచి చేస్తున్న వారి పక్షాన ఉండడం అనివార్యం. చెడుకైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. నిజాయితీగల పత్రికా రచయితలు నిరపేక్షంగా ఉంటారు. ఉండాలి. అధికారం కోసం పెనుగులాటలకు నీరజా చౌదరి ప్రత్యక్ష సాక్షి. కుట్రలు, స్పర్థలు, పోటీలు అత్యున్నత స్థాయిలో ఎలా ఉంటాయో గమనించారు. ప్రధానమంత్రులే సర్వస్వానికి కేంద్ర బిందువు అయిపోయారు గనక వారి నిర్ణయాలకు దేశ గమనాన్నే మార్చే శక్తి ఉంటుంది.

ఈ గ్రంథం రాయడానికి ఆమె అపారమైన పరిశోధన చేయాల్సి



వచ్చింది. డజన్ల మందితో మాట్లాడారు. పాత జ్ఞాపకాలను తైపారు వేసుకున్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల తరవాత జాతీయ స్థాయిలో ఏర్పడిన మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వంలో ప్రధానమంత్రి మొరార్జీ దేశాయి ప్రభుత్వం పతనం కావడానికి కారణాలు ఈ గ్రంథం చదివితే తెలుస్తాయి. ఆ తరవాత ప్రధాని అయిన చరణ్ సింగ్ జీవిత కాంక్ష అయితే తీరింది కానీ ప్రధానిగా పార్లమెంటులో అడుగైనా పెట్టని ఏకైక ప్రధాని చరణ్ సింగ్ అని గుర్తు లేని వారి జ్ఞాపకల పొరలు తిరగేయడానికి ఈ గ్రంథం ఉపకరిస్తుంది. ప్రధానమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి సుగుణాలు, అవగుణాలు, ఆదర్శాలు, వైరుధ్యాలు, ఇష్టాయిష్టాలు, అనుసరించే సిద్ధాంతాలు లేదా ఆ వ్యక్తిలో ఉండే అవకరాలు, సైద్ధాంతిక దివాలాకోరుతనం లేదా విద్వేషం నింపే సైద్ధాంతిక ధోరణి మొదలైనవి దేశ గమనంపై ప్రభావం చూపుతాయి. దేశ నిర్మాతలుగా పేరు తెచ్చుకున్న ప్రధానులూ ఉన్నారు. జాతి జీవలక్షణాన్ని చిదిమేసిన వారూ ఉన్నారు. మూణ్నాళ్ల ముచ్చటగా ప్రధానులైన చరణ సింగ్, దేవెగౌడ, ఐ.కె.గుజరాల్ లాంటి వారున్నట్టే దీర్ఘకాలం ప్రధాని పదవిలో ఉన్న వారూ ఉన్నారు. ప్రధానమత్రులు కావాలని ఆశించి అది దక్కని వారూ ఉన్నారు. కానీ నీరజా చౌదరి వారిలో ఆరుగురిని మాత్రమే ఈ గ్రంథ రచనకు ఎంపిక చేసుకున్నారు. భవిష్యత్తుకు బాటలు వేసిన వారు, నిశ్శబ్దంగా నిష్క్రమించిన వారు ఉన్నారు. నీరజా చౌదరి గ్రంథాన్ని చదివితే గత ప్రభుత్వాల హయాంలో అంతా శూన్యమేనని చరిత్రను తిరస్కరించే ప్రధాని గురించి తెలుసుకునే అవకాశమూ ఉంది. నీరజా చౌదరి ఎవరినీ పనిగట్టుకుని పొగడలేదు, తెగడనూ లేదు. తాను రాస్తున్నది ఉన్నత స్థానాల్లో ఉన్నవారి గురించే అయినా వారూ మనుషులే కనక వారిలో లోపాలు నిర్మొహమాటంగానే ఎత్తి చూపారు. నెహ్రూను మినహాయిస్తే మిగతా ప్రధానులకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ సారం మీద శ్రద్ధ కనిపించదు. చాల మంది ప్రధానుల నిర్ణయాల్లో దాపరికంలేని తత్వం లేదు. మంత్రివర్గంలో అందరూ సమానమే, ప్రధాని సమానుల్లో ప్రథముడు అని అంగీకరించిన వారు అరుదు. తమ కీర్తిని ఇనుమడింప చేసుకోవడానికి ప్రయత్నించిన వారే ఎక్కువ.

ఎమర్జెన్సీ విధించి అధికారం కోల్పోయి 1980లో మళ్లీ అధికారంలోకి రావడానికి ఇందిరా గాంధీ అనుసరించిన మార్గంబీ షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును రాజీవ్ గాంధీ తిరగతోడిన వైనం; మండల్ కమిషన్ సిఫార్సులపై వి.పి. సింగ్ విధానంవల్ల దేశ రాజకీయాల్లో శాశ్వతంగా వచ్చిన మార్పు; పీవీ నరసింహారావు ఎటూ తేల్చని తత్వంవల్ల బాబ్రీ మసీదు విధ్వంసం; మామూలుగా శాంతిని కోరుకునే అటల్ బిహారీ వాజపేయి రెండో అణ్వాయుధ పరీక్ష జరిపించిన తీరు; అత్యంత బలహీనమైన ప్రధానమంత్రి అనుకున్న డా. మన్మోహన్ సింగ్ అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి చూపిన పట్టుదల మొదలైన అంశాలన్నీ నీరజా చౌదరి గీసిన కలం బొమ్మలలో రూపు కట్టాయి. తాను రాస్తున్న ఏ ప్రధానమంత్రిని ఆకాశానికెత్తడం కానీ, కించపరచడం కానీ "హౌ ది ప్రైం మినిస్టర్స్ డిసైడ్‌లో వెతికినా దొరకదు. నీరజా చౌదరి వారిని మామూలు మనుషులుగానే చూశారు. మానవ సహజమైన బలహీనతలు ఉంటాయన్న ఆకళింపు సంపూర్ణంగా ఉండే ఈ గ్రంథం రాశారు. రాయబరేలీలో ఓటమి తరవాత ఇందిరా గాంధీ అస్త్రసన్యాసం చేయాలనుకోవడం, షాబానో ఉదంతం తరవాత ఆర్.ఎస్.ఎస్.ను రాజీవ్ గాంధీ మాలిమి చేసుకోవడం, వాజపేయి కాన్సర్ తో మరణించడం, శివసేన ఒక దశలో ఇందిరా గాంధీని సమర్థించడం లాంటి వాస్తవాలు ఈ పుస్తకం చదివితే గానీ తెలియదు. సంజయ్ గాంధీ వ్యవహారం కూడా ఈ గ్రంథంలో విస్తారంగానే ఉంది.

ఇందిరా గాంధీ సెక్యులరిజాన్ని చిన్న చూపు చూశారని నీరజా చౌదరి అంటారు. ఇందిరా గాంధీ నుంచి ఆర్.ఎస్.ఎస్. పొందిన సహాయం, ఆమె ఆర్.ఎస్.ఎస్. మద్దతు పొందిన వైనం కూడా ఈ గ్రంథంలో వివరంగా ఉంది. కాంగ్రెస్ లో వృద్ధ తరంతో కూడిన సిండికేట్ నాయకులను నిలవరించడానికి, ఎమర్జెన్సీకి ముందు ఆర్.ఎస్.ఎస్.ను ఎదిరించడానికి, ఇందిరా గాంధీ వామపక్షాలను ఎలా ఉపయోగించుకున్నారో నీరజా చౌదరి వినసొంపుగా వివరించారు. 1971లో పాకిస్థాన్‌తో యుద్ధంవల్ల ఆ దేశం రెండు ముక్కలైనందుకు ఆర్.ఎస్.ఎస్. ఎలా మహదానంద పడిందో, 1980లో ఆమె మళ్లీ అధికారంలోకి రావడానికి ఆర్.ఎస్.ఎస్. చేసిన సహాయం లాంటి సున్నితమైన అంశాలను నీరజా చౌదరి చెప్పిన తీరు అబ్బుర పరుస్తుంది. ఈ అంశాన్ని ఇందిరా గాంధీ బహిరంగంగా అంగీకరించలేదు. బాబరి మసీదును కూలుస్తున్నప్పుడు పీవీ నరసింహా రావు పూజలో ఉన్నారని, టీవీ చూస్తున్నారని, మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్నారని రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కానీ "జరిగిందేదో మంచికే జరిగింది. ఇక్కడితో బీజేపీ కథ ముగుస్తుంది" అని పీవీ అన్న మాటలను ఈ గ్రంథంలో చూడొచ్చు.

లడఖ్‌లో 'రాష్ట్ర హోదా' పోరు

- నిరసనలు ఉధృతం
- నాలుగు డిమాండ్లతో వేలాది మంది ఉద్యమం

శ్రీనగర్: రాష్ట్ర హోదా కల్పించాలంటూ లడఖ్‌లో నిరసనలు తీవ్రమవుతున్నాయి. లడఖ్‌కు రాష్ట్ర హోదా ప్రధాన డిమాండ్‌గా ఉంది. అయితే గిరిజన రాష్ట్రంగా గుర్తింపు, స్థానికులకు ఉద్యోగ రిజర్వేషన్లు, లడఖ్-కార్గిల్‌లకు ఒక్కో పార్లమెంటరీ సీటు కేటాయింపు అనే మరో మూడు డిమాండ్లను కూడా నిరసకారులు లేవనెత్తారు. ఆదివారం లడఖ్ అంతా బంద్‌కు పిలుపునిచ్చారు. శనివారం లడఖ్‌లోని లేహ్ జిల్లాలో భారీ నిరసన ర్యాలీలు చేశారు. చలిని సైతం లెక్క చేయకుండా వేలాది మంది పాల్గొన్నారు. లేహ్ అత్యున్నత మండలి (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ) బంద్‌కు పిలుపునిచ్చింది. లడఖ్‌కు రాష్ట్ర హోదా, గిరిజన రాష్ట్రంగా గుర్తింపును డిమాండ్ చేస్తూ జనవరి 23న కేంద్ర హోం శాఖకు వినతి పత్రం కూడా సమర్పించారు. లడఖ్‌కు రాష్ట్ర హోదా కోసం 2019 నాటి జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు ముసాయిదాను కూడా ఇచ్చారు. ఎల్ఏబీ, కేడీఏ న్యాయ సలహాదారు హాజీ గులామ్ ముస్తఫా మాట్లాడుతూ 'ప్రజల కేంద్రంగా ఉన్న మా అధికారాలన్నీ బలహీనపడ్డాయి. మేము జమ్మూకశ్మీర్‌లో భాగమైనప్పుడు మాకు అసెంబ్లీలో నలుగురు, శాసన మండలిలో ఇద్దరు సభ్యులు ఉన్నారు. ఇప్పుడు మాకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేదు. మా డిమాండ్ ఎల్లప్పుడూ ఉంది. లడఖ్ ప్రజలకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉండాలి. మాకు రాష్ట్ర హోదా రావాలి' అని అన్నారు. లడఖ్ వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశం, ఈశాన్య రాష్ట్రాల లక్షణాలతో గిరిజనులు మెజారిటీ ప్రాంతం అని ఆయన అన్నారు. 'ఈశాన్య రాష్ట్రాల తరహాలో లడఖ్ సంస్కృతిని పరిరక్షించడానికి 6వ షెడ్యూల్‌లోని నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతంగా మారినప్పటి నుంచి ఈ ప్రాంతంలో గెజిటెడ్ ఉద్యోగ అవకాశాలు లేవు. జమ్మూకశ్మీర్‌లో రెండు బ్యాచ్‌లు ఉన్నాయి. ఇప్పటికే ప్రారంభించబడ్డాయి. మూడవ బ్యాచ్ త్వరలో ప్రారంభించబడుతుంది. లడఖ్ తక్షణమే దాని స్వంత పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కలిగి ఉండాలి' అని ఆయన పేర్కొన్నారు. లడఖ్ ప్రజలు ఈ ప్రాంతాన్ని శక్తివంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. లడఖ్-లేహ్, కార్గిల్ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు సంస్థల ప్రతినిధులతో హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అధ్యక్షతన ఉన్న ఉన్నతస్థాయి కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్న క్రమంలో ఈ నిరసనలు వెల్లువెత్తాయి. కాగా, డిసెంబరు 4న జరిగిన భేటీలో కేంద్ర హోం శాఖ రెండు సంస్థల నుంచి డిమాండ్ల జాబితాను కోరింది. ఇదిలాఉండగా, రక్తం గడ్డకట్టే చలిని సైతం లెక్కచేయకుండా వేలాది మంది లడఖ్ ప్రజలు రోడ్లపైకి వచ్చి నాలుగు ప్రధాన డిమాండ్లతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జమ్మూకశ్మీర్ నుంచి ఆర్టికల్ 370 తొలగించబడిన తరువాత, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతంగా కేంద్రం ప్రకటించింది. దీంతో లడఖ్-జమ్మూకశ్మీర్ నుంచి వేరు చేయబడింది. కేంద్ర పాలిత ప్రాంతం నుంచి రాష్ట్ర హోదా రాజ్యాంగ రక్షణ డిమాండ్ చేస్తూ లడఖ్ ప్రజలు ప్రదర్శన చేపట్టారు. లడఖ్ శనివారం మూతపడింది. కార్గిల్, లేహ్ వీధుల్లో ప్రజలు గుమిగూడారు. ఈ ప్రదర్శన ఈ వారం ప్రారంభంలో ప్రకటించారు. ఈ ప్రాంత ప్రజల డిమాండ్లపై హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి రెండో దఫా సమావేశాన్ని శుక్రవారం కేంద్రం ప్రకటించింది.

డిమాండ్లు ఏమిటంటే...

లడఖ్‌కు రాష్ట్ర హోదాతో పాటు మరో మూడు ప్రధాన డిమాండ్లపై రెండు సామాజిక-రాజకీయ సంస్థలు ఉద్యమానికి నాయకత్వం వహించాయి. ఇందులో లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేఏబీ) ఉన్నాయి. ఈ సంస్థలు నాలుగు ప్రధాన డిమాండ్లను కలిగి ఉన్నాయి. వీటిలో లడఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ ప్రకారం భద్రతా చర్యలు, యువతకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు, లేహ్-కార్గిల్‌కు ప్రత్యేక పార్లమెంటరీ నియోజకవర్గాల ఏర్పాటు ఉన్నాయి. డిసెంబరు 4న జరిగిన మొదటి దఫా చర్చల్లో హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ నేతృత్వంలోని కమిటీ దాని భౌగోళిక స్థానం, వ్యూహాత్మక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుంది. అలాగే లడఖ్‌కు చెందిన 'విశిష్ట సంస్కృతి, భాష' ను పరిరక్షించే చర్యలు, లడఖ్ ప్రజలకు భూమి, ఉపాధి భద్రతను నిర్ధారించే చర్యల గురించి చర్చించారు.

ఫిబ్రవరి 19న రెండో విడత చర్చలు

ఫిబ్రవరి 19న హోం మంత్రిత్వ శాఖలో రెండో విడత చర్చలు జరగనున్నాయి. 15 మంది సభ్యులతో కూడిన కమిటీలో ప్రభుత్వానికి చెందిన ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. వీరిలో లెఫ్టినెంట్ గవర్నర్, బ్రిగేడియర్ బి.డి.మిశ్రా (రిటైర్డ్), లడఖ్ బీజేపీ ఎంపీ జమ్యాంగ్ త్సెరింగ్ నామ్‌గ్యాల్, కార్గిల్, లేహ్ రెండింటికి చెందిన అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్, హోం మంత్రిత్వ శాఖ అధికారులు ఉన్నారు.

ఒక వర్గం నిర్వీర్యమే సీఏఏ లక్ష్యం

కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం: కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలును తమప్రభుత్వం వ్యతిరేకిస్తున్నదని కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. ఈ వైఖరికి ఇప్పటికీ ఎల్డీఎఫ్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పునరుద్ఘాటించారు. దేశాభిమాని సాహిత్య అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక వర్గాన్ని నిర్వీర్యం చేయటమే సీఏఏ లక్ష్యమన్నారు. "సీఏఏను త్వరలో అమలు చేస్తారన్న వార్తను మేము వింటున్నాం. దీని (సీఏఏ) అమలు కేరళలో జరగదని మేము అప్పట్లోనే చెప్పాం. ఇప్పటికీ ఎల్డీఎఫ్ ప్రభుత్వ వైఖరి ఇదే" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. లౌకిక దేశాన్ని మతతత్వ దేశంగా మార్చే ప్రయత్నాలు బలంగానే జరుగుతున్నాయని విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏ అమలును ఎవరూ ఆపలేరని గతేడాది డిసెంబర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

మణిశంకర్ అయ్యర్ కుమార్తెపై కేసు నమోదు

న్యూఢిల్లీ: ఒక వర్గం మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ కుమార్తె సురన్యాపై కేసు నమోదైంది. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠను ఉద్దేశించి ఆమె గత నెల 20న సామాజిక మాధ్యమంలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. అయోధ్య కార్యక్రమానికి నిరసనగా తాను మూడు రోజుల పాటు ఉపవాసం ఉంటున్నట్లు ప్రకటించారు. ఈ పోస్టుపై వివాదం చెలరేగింది. సుప్రీం కోర్టు న్యాయవాది, బీజేపీ నేత అజేయ్ అగర్వాల్ శనివారం దిల్లీ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదు చేశారు. దీనితో సురన్యాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సురన్యా ఇల్లు ఖాళీ చేయాలని జాంగ్‌పుర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. శాంతి, సామరస్యాలకు భంగం కలిగించే చర్యలు చేపడుతున్నందున తమ కాలనీ నుంచి వెళ్లిపోవాలని కోరుతూ బుధవారం లేఖ రాసింది. దీనికి ఆమె ఫేస్‌బుక్‌లో సమాధానమిస్తూ.. తాము నివసిస్తున్న ఇంటికి ఆ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో సంబంధం లేదని పేర్కొన్నారు.

జర్నలిస్టులపై అఖిలేశ్ అసహనం

బారాబంకి: సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ జర్నలిస్టులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని బారబంకి జిల్లా బల్హర పంచాయతీలో ఉత్తమ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమానికి మహిళా సర్పంచ్ స్థానంలో ఆమె బంధువు ఒకరు హాజరుకావడంపై మీడియా ప్రశ్నించగా అఖిలేశ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచి షబానా ఖతున్ నిర్వహించాల్సి ఉంది. కానీ, కార్యక్రమం ప్రారంభం కాగానే ఆమె అదృశ్యమైపోయారు. ఆమె భర్త సోదరుడు అయాజ్ ఖాన్ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన బోర్డులపై కూడా ఆమె పేరు లేదు. అయాజ్ పేరుంది. పక్కనే 'చైర్మన్' అని రాసుంది. వాస్తవానికి ఆమె ఏనాడు పంచాయతీ సమావేశాలకు, కార్యక్రమాలకు హాజరుకాలేదు. ఆమె భర్త సోదరుడే మొత్తం చూసుకునే వాడు. తాజాగా ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు అఖిలేశ్ యాదవ్ వచ్చారు. మహిళా సర్పంచి గైర్హాజరుపై ఆయన్ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. 'ఇదేమైనా కొత్తా..? చాలా మంది సర్పంచుల భర్తలు ఇక్కడున్నారు. ఇది నిజంగా ఒక సమస్యే. నేనొక ప్రశ్న అడుగుతాను.. మీ రిపోర్టర్లలో అంతా పురుషులే ఎందుకున్నారు" అని ఎదురు ప్రశ్నించారు. దీంతో ఆయన మద్దతుదారులు కేరింతలు కొట్టారు. మీ ఛానల్‌లో మహిళా రిపోర్టరు లేకపోతే ఎవరిని పంపిస్తారు..? అంటూ మరో విలేకరిని నవ్వుతూ అడిగారు. తాను వారి ప్రశ్నకు సమాధానం మాత్రమే ఇస్తున్నట్లు చెప్పారు.

మహారాష్ట్ర కూటమి ప్రభుత్వంలో గ్యాంగ్‌వార్

శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే

సావంత్‌వాడి (మహారాష్ట్ర): మహారాష్ట్ర కూటమి ప్రభుత్వంలో 'గ్యాంగ్ వార్' చెలరేగిందని, ఇతర పార్టీలను విచ్ఛిన్నం చేయడం, నాయకులను చేర్చుకోవడం ద్వారా బీజేపీ రాష్ట్ర విభాగం బలహీనపడిందన్న విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అర్థం చేసుకోవాలని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. థానే జిల్లాలోని ఉల్హాస్‌నగర్ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్‌లో స్థానిక శివసేన నాయకుడు (ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందినవాడు) పై బీజేపీ ఎమ్మెల్యే కాల్పులు జరిపిన సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ (56)ని అరెస్ట్ చేశారు. దాడికి గురైన శివసేన కళ్యాణ్ విభాగం అధ్యక్షుడు మహేష్ గైక్వాడ్ (40) పరిస్థితి విషమంగా ఉంది. మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలోని సావంత్‌వాడి వద్ద జరిగిన ర్యాలీని ఉద్దేశించి థాకరే మాట్లాడుతూ 1990లలో గత శివసేన బీజేపీ ప్రభుత్వం ముంబైలోని అండర్ వరల్డ్ ముఠాల వెన్ను విరిచిందన్నారు. 'కానీ ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వంలో గ్యాంగ్ వార్ చెలరేగింది. రూ.70 వేల కోట్ల నీటిపారుదల కుంభకోణంలో మూడవ ముఠా పాత్ర లోతుగా ఉంది. అందువల్ల దాని తల ఎత్తడానికి సమయం లేదు' అని ఠాక్రే ఆరోపించారు. 'ఇతర పార్టీలను విచ్ఛిన్నం చేసే ధోరణి, నాయకులను దాని గుప్పిట్లోకి చేర్చుకోవడం వల్ల బీజేపీ రాష్ట్ర విభాగం బలహీనపడిందని ప్రధాని మోదీ అర్థం చేసుకోవాలి' అని అన్నారు. తాను ఏ వ్యక్తికీ వ్యతిరేకం కాదని, అబద్ధాలు, నియంతృత్వానికి వ్యతిరేకమని ఠాక్రే స్పష్టం చేశారు. దేశానికి పూర్తి మెజారిటీతో కూడిన ప్రభుత్వం అవసరం లేదని, అందరినీ కలుపుకునిపోయే వివిధ ప్రతిపక్ష పార్టీలతో ఏర్పడిన కూటమి 'ఇండియా' కూటమి పాలన అవసరమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే (కొద్ది నెలల్లో) వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం ఉండదని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ తరచుగా మహారాష్ట్రకు పర్యటిస్తున్నారని ఠాక్రే అన్నారు. 'ఆయన వచ్చిన ప్రతిసారీ రాష్ట్రం నుంచి గుజరాత్‌కు ఏదో తీసుకెళతాడు. సింధుదుర్గ్‌లోని కొంకణ్ తీరంలో నావికా దినోత్సవం జరుపుకుంటారు. ప్రధాని ఇక్కడకు వచ్చారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను ఆమోదించిన సబ్‌మెరైన్ టూరిజం ప్రాజెక్టు గుజరాత్‌కు తరలిస్తున్నారని వింటున్నాను' అని పేర్కొన్నారు. ప్రాజెక్టును తరలించే ఆలోచన లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 'ప్రధానమంత్రి ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ ఏదో ఒకటి తీసుకువెళుతుంటారు. తౌక్టే, నిసార్గ్ అనే రెండు తుపానులను ఎదుర్కొన్నప్పుడు ఆయన ఇక్కడికి రాలేదు. ఆర్థిక సహాయం చేయలేదు' అని ఠాక్రే తెలిపారు. 'ఇలాంటి ప్రధాని మనకు అవసరమా?' అని సభకు హాజరయిన ప్రజలను ప్రశ్నించారు.

గ్యాంగ్‌వార్‌కు సీఎం షిండే నాయకత్వం

ఆదిత్య ఠాక్రే



ముంబై: మహారాష్ట్రలో గ్యాంగ్ వార్ నడుస్తోందని, దానికి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నాయకత్వం వహిస్తున్నారని శివసేన (యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రే ఆదివారం విమర్శించారు. థానేలో శివసేన నాయకుడిపై బీజేపీ ఎమ్మెల్యే జరిపిన కాల్పుల ఘటనను ప్రస్తావించారు. కళ్యాణ్ తూర్పు బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ అరెస్టు ముందు, సీఎం షిండే రాష్ట్రంలో నేరాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. 'గణపత్ గైక్వాడ్ భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నాడు. దానిని స్థానిక మహిళలు వ్యతిరేకించారు. ఈ మహిళలకు మద్దతుగా ఉన్న మహేష్ గైక్వాడ్‌పై అతను కాల్పులు జరిపాడు. సీఎం షిండే తనను నేరస్తుడిని చేశాడని గణపత్ గైక్వాడ్ స్వయంగా చెప్పాడు' అని ఠాక్రే పేర్కొన్నారు. 'మహారాష్ట్రలో గ్యాంగ్ వార్ జరుగుతోంది. దానికి సీఎం షిండే నాయకుడు. షిండే ద్రోహి అనే ట్యాగ్‌ని కలిగి ఉన్నాడు. దానిని లోతుగా శుభ్రం చేయాలి. (ముంబైతో సహా పట్టణ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్ర కార్యక్రమాన్ని ఎద్దేవా చేస్తూ)' అని వర్లీ ఎమ్మెల్యే అన్నారు. ఇతర సమస్యలపై మాట్లాడుతూ మహాలక్ష్మి రేస్‌కోర్స్‌లో అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సదుపాయాన్ని నిర్మించడానికి బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ నిధులను వినియోగించే ప్రణాళికను తాను వ్యతిరేకిస్తానని ఠాక్రే అన్నారు.

గత ప్రభుత్వాలు పవిత్ర స్థలాల ప్రాముఖ్యతను విస్మరించాయి

ప్రధాని నరేంద్ర మోదీ

గుహవతి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దీర్ఘకాలంపాటు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు భారత్‌లోని పవిత్ర స్థలాల ప్రాముఖ్యతను గుర్తించడంలో విఫలమయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆదివారం అసోంలో పర్యటించిన ఆయన రాష్ట్రంలో రూ.11,600 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం ఖానాపరాలోని వెటర్నరీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. దేశంతోపాటు దక్షియా ఆసియాతో ఈశాన్య ప్రాంత అనుసంధానాన్ని ఇవి మెరుగుపరుస్తాయని తెలిపారు. గత పదేళ్ల కాలంలో రికార్డు స్థాయిలో పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించారని తెలిపారు. ఇవి పర్యాటక రంగంలో మరింత ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని, క్రీడా ప్రతిభను పెంచుతాయని చెప్పారు. దీంతోపాటు ఈ ప్రాంతంలో వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణను మెరుగుపరుస్తాయని మోదీ పేర్కొన్నారు.'భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత అధికారంలో ఉన్నవాళ్లు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను విస్మరించారు. వాటిని పాటించడం అవమానకరం అనే భావన కల్పించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పవిత్ర స్థలాలను పట్టించుకోలేదు. రాజకీయ లబ్ధి కోసం మన గతాన్ని మరుగున పడేలా వ్యవహరించారు. గత జ్ఞాపకాలను తుడిచేసిన ఏ దేశం కూడా పురోగతి సాధించలేదు. అవి కేవలం పర్యాటక ప్రదేశాలు మాత్రమే కాదు.. వేల ఏళ్లనాటి భారత నాగరికతకు చిహ్నాలు. సంక్షోభాలను ఎదుర్కొని దేశం స్థిరంగా ఎలా నిలబడిందో చెప్పే గుర్తులు. గత పదేళ్లలో ఈ పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చింది' అని ప్రధాని చెప్పుకొచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీ శనివారం గుహవతి చేరుకున్నారు. మరోవైపు మోదీ అసోం పర్యటనకు ముందు రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి. సీఏఏకు వ్యతిరేకంగా కో ఆర్డినేషన్ కమిటీ శనివారం మధ్యాహ్నం గుహవతిలోని లఖిధర్ బోరా ఖేత్రాలో ప్రదర్శన నిర్వహించింది.

భారత రాయబార కార్యాలయంలో

పాక్ గూఢచర్యం

మీరట్‌లో ఐఎస్ఐ ఏజెంట్ అరెస్టు

న్యూఢిల్లీ: భారత్-రష్యా వ్యూహాత్మక సంబంధాలపై పాకిస్తాన్ గూఢచర్యం గుట్టు రట్టయింది. ఏకంగా మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలోనే పాకిస్తాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ తన గూఢచారిని నియమించింది. తాజాగా అతడిని ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) మీరట్‌లో అదుపులోకి తీసుకుంది. నిందితుడిని సతేందర్ సివాల్‌గా గుర్తించింది. అతడు విదేశాంగ శాఖలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నాడు. భారత విదేశాంగ శాఖలో ఒక ఐఎస్ఐ ఏజెంట్ చొరబడ్డాడని రహస్య సమాచారం అందడంతో ఏటీఎస్ అప్రమత్తమైంది. అతడు భారత సైన్యానికి సంబంధించిన సమాచారాన్ని పాక్ నిఘా సంస్థకు అందజేస్తూ... ప్రతిగా డబ్బు తీసుకొంటున్నట్లు కనుగొంది. సతేందర్‌ను హాపూర్ జిల్లా షమహిద్దుయూన్‌పూర్ వాసిగా గుర్తించారు. అతడు మాస్కోలోని కార్యాలయంలో 2021 నుంచి ఇండియా బేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్‌గా (ఐబీఎస్ఏ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. పాక్ గూఢచర్య నెట్‌వర్క్‌లో అతడు కీలక వ్యక్తని అధికారులు చెబుతున్నారు. తన హోదాను అడ్డం పెట్టుకుని అతడు ముఖ్య పత్రాలను సంపాదించాడు. వీటిల్లో రక్షణ, విదేశాంగ శాఖ నిర్ణయాలు, సైన్యం రోజువారీ కదలికలు వంటి వివరాలున్నాయి. ఈ క్రమంలో అతడు కొందరు భారత అధికారులకు ముడుపులు ముట్టజెబుతానని ఆశ చూపాడు. ఈ సమాచారాన్ని పాక్‌లోని ఐఎస్ఐ ప్రతినిధులకు చేర్చాడు. అతడి కదలికలపై నిఘా పెట్టిన తర్వాతే ఏటీఎస్ అధికారులు మీరట్‌లో విచారణకు పిలిపించారు. అడిగిన ప్రశ్నలకు అతడు సరైన సమాధానాలు ఇవ్వలేదు. చివరికి తాను పాక్‌కు గూఢచర్యం చేస్తున్నట్లు అంగీకరించాడు.

ఆదివాసీలకు అండగా నిలుస్తాం: రాహుల్

ధన్‌బాద్: ఆదివాసీ ప్రజల 'జల్-జంగిల్-జమిన్' (నీరు, అడవి, భూమి) హక్కులు, యువకుల ఉపాధి కోసం తమ పార్టీ పోరాడుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్‌షోలో రాహుల్ మాట్లాడారు. శనివారం రాత్రి జిల్లాలోని తుండి బ్లాక్‌లో బసచేసిన రాహుల్... ధన్‌బాద్ నగరంలోని గోవింద్‌పూర్‌లో తిరిగి యాత్రను ప్రారంభించారు. సరైఢేలా, ఐఐటీ-ఐఎస్ఎం గేట్, రణధీర్ వర్మ చౌక్, రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రామిక్ చౌక్ మీదుగా రాహుల్ యాత్ర బ్యాంక్ మోర్‌కు చేరుకుంది. అక్కడ ఆయన బహిరంగ సభలో ప్రసంగించారు. అనంతరం బొకారో జిల్లాలోకి ప్రవేశించింది. బహిరంగసభలో రాహుల్ మాట్లాడుతూ... ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు విక్రయించకుండా కాపాడడం, దేశంలోని యువతకు ఉపాధి భరోసా కల్పించడం, గిరిజనులకు న్యాయం చేయడం యాత్ర ప్రధాన లక్ష్యం అని చెప్పారు. గిరిజనుల జల్-జంగల్-జమీన్ కోసం కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందన్నారు. యువత విద్య, ఉపాధి కోసం పాటుపడుతుందని, ఆర్థిక అసమతుల్యత, నోట్ల రద్దు, జీఎస్టీ, నిరుద్యోగం దేశంలో యువత భవిష్యత్తును నాశనం చేశాయన్నారు.

యూపీలో యాత్ర షెడ్యూలు రెండ్రోజుల్లో తెలియజేస్తాం: జైరామ్ రమేశ్

ఉత్తరప్రదేశ్‌లో భారత్ జోడో న్యాయ యాత్రకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైన తర్వాత ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు తెలియజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ప్రకటించింది. జోడో యాత్రపై తనకు సమాచారం లేదని సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించిన మరుసటి రోజే ఈమేరకు కాంగ్రెస్ స్పష్టత నిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మీరు జోడో యాత్రలో పాల్గొంటారా అని శనివారం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ... 'సమస్య ఏమిటంటే, చాలా పెద్ద కార్యక్రమాలు జరుగుతాయి. కానీ మాకు ఆహ్వానం లేదు' అన్నారు. యాదవ్ వ్యాఖ్యలపై జైరామ్‌రమేశ్ ఓ వీడియోను ట్యాగ్ చేస్తూ... ఉత్తరప్రదేశ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర జరిగే మార్గం, ఇతర కార్యక్రమాలను సిద్ధం చేస్తున్నామని... ఒకటి లేదా రెండు రోజుల్లో ఖరారు చేస్తామని చెప్పారు. ఆ తర్వాత కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు తెలియజేస్తామన్నారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్రలో వారు పాల్గొనడం భారత కూటమిని మరింత బలోపేతం చేస్తుంది. యాత్ర ఫిబ్రవరి 16 మధ్యాహ్నం యూపీలోకి ప్రవేశిస్తుందని భావిస్తున్నాం' అని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే 'కొనుగోలు' ఆరోపణలపై ఆతిషికి నోటీసులు

న్యూఢిల్లీ: ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న ఆరోపణలపై దిల్లీ పోలీసు క్రైమ్ బ్రాంచ్ ఆదివారం దిల్లీ మంత్రి ఆతిషికి నోటీసులు అందజేసింది. అంతకుముందు, పోలీసు బృందం అతిషి నివాసానికి చేరుకున్నప్పుడు మంత్రి లేకపోవడంతో ఆమె ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) కి నోటీసు అందించారు. సోమవారం (ఫిబ్రవరి 5)లోగా నోటీసుపై స్పందించాలని ఆతిషీని కోరారు. శనివారం ముఖ్యమంత్రి కార్యాలయానికి దిల్లీ పోలీసుల నుంచి సమన్లు అందాయి. 'ఆప్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పార్టీని వీడి బీజేపీలో చేరేందుకు బీజేపీ ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఆఫర్ చేసిందని మీరు చేసిన ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదుపై క్రైమ్ బ్రాంచ్ విచారణ జరుపుతోంది. ఈ ఆరోపణలను మీరు 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) లో 27.01.2014న పోస్ట్ చేశారు' అని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు క్రైమ్ బ్రాంచ్ నోటీసు పంపింది. ఇదిలాఉండగా, ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ 'ప్రలోభపెట్టింది' అనే ఆప్ ఆరోపణలపై క్రైమ్ బ్రాంచ్ విచారణ ప్రారంభించినట్లు వచ్చిన నివేదికలను తాము స్వాగతిస్తున్నట్లు బీజేపీ దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. కేజ్రీవాల్ ఆరోపణలపై పోలీసు విచారణకు డిమాండ్ చేస్తూ, ఆప్ ఎమ్మెల్యేలకు అలాంటి ఆఫర్ ఏమీ ఇవ్వలేదని పేర్కొంటూ జనవరి 30న బీజేపీ దిల్లీ విభాగం ఫిర్యాదు చేసింది. కేజ్రీవాల్‌కు క్రైమ్ బ్రాంచ్ నోటీసులు అందజేసిందని, తన ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని లేదా క్రిమినల్ ప్రొసీడింగ్‌లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సచ్‌దేవా అన్నారు.

కార్పొరేట్లకు ప్రస్తుత పన్నుల విధానం సరైనదే

రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ: కార్పొరేట్లకు ప్రస్తుతం ఉన్న పన్నుల విధానం చాలా సహేతుకమైనదని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా చెప్పారు. '22 శాతం పన్నుతో కార్పొరేట్‌లకు ప్రస్తుతం ఉన్న పన్నుల విధానం భారతదేశపు ఆర్థిక వ్యవస్థతో పోల్చినప్పుడు 'చాలా సహేతుకమైనది'. అందువల్ల కొత్త తయారీ యూనిట్ల కోసం నాలుగు సంవత్సరాలుగా అమలులో ఉన్న రాయితీ పన్ను విధానాన్ని మార్చి 2024 తర్వాత పొడిగించలేదు' అని అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో, మల్హోత్రా మాట్లాడుతూ 2024-25 మధ్యంతర బడ్జెట్ పన్నుల పాలనలో కొనసాగింపును అందిస్తుందన్నారు. గత సంవత్సరాల్లో పన్ను చెల్లింపుదారులకు అందించిన ప్రయోజనాలు వ్యక్తిగత ఆదాయపు పన్నులో భారీ ఉత్సాహం రూపంలో ఫలితాలను చూపుతున్నాయని తెలిపారు. 'పన్ను చెల్లింపుదారుల సేవలు ప్రభుత్వం ప్రధాన దృష్టిగా ఉన్నాయి. ఇది ముందుకు సాగుతుంది. పన్ను చెల్లింపుదారుల సేవలలో హేతుబద్ధీకరణ, సరళీకరణ, విశ్వసనీయ ఆధారిత పన్నులు తక్కువ పరిశీలన, మరింత కచ్చితమైన అంచనాలు, సాంకేతికత వినియోగంతో ఉంటాయి. పన్ను చెల్లింపుదారుల సేవలు మరింత మెరుగుపడతాయని మేము ఆశిస్తున్నాము. సమ్మతి, పన్ను వసూలు సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో మాకు సహాయం చేస్తుంది' అని అన్నారు. ఈ పథకం 2019లో ప్రవేశపెట్టడం జరిగిందని, రాయితీ 15 శాతం పన్ను రేటును పొందేందుకు కొత్త యూనిట్లను ఏర్పాటు చేయడానికి కంపెనీలకు చాలా సమయం ఇచ్చినట్లు ఆయన వివరించారు. 'నాలుగు సంవత్సరాల సుదీర్ఘ కాలం ఇచ్చాము. ఇది ఒక పెద్ద కంపెనీ ప్రణాళిక, నిధుల సమీకరణకు సంబంధించినది. దీనికి తగిన సమయం ఇచ్చాము. కోవిడ్ మహమ్మారి కారణంగా దీనిని మార్చి 31, 2024 వరకు మరో సంవత్సరం పొడిగించాము' అని అన్నారు. 'మార్చి 31, 2024లోపు తమ కార్యకలాపాలను ప్రారంభించగలిగిన కొత్త తయారీ కంపెనీలు ఆ ప్రయోజనాన్ని పొందుతూనే ఉంటాయి' అని మల్హోత్రా పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కంపెనీలకు బేస్ కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించడం, కొత్త తయారీ సంస్థలకు, అక్టోబర్ 1, 2019 తర్వాత 25 శాతం నుంచి 15 శాతానికి చేర్చడం జరిగింది. ఈ కొత్త పన్ను రేట్లను ఎంచుకునే కంపెనీలు అన్ని మినహాయింపులు, ప్రోత్సాహకాలను వదులుకోవలసి ఉంటుందన్నారు. ఆదాయం, కార్పొరేట్ పన్ను రేట్లపై విధించే స్వచ్ఛ భారత్ పన్ను, విద్యా పన్ను వంటి సర్ చార్జీలు, పన్నులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఇప్పటికే ఉన్న యూనిట్లకు ప్రభావవంతమైన పన్ను రేటు అంతకుముందు 34.94 శాతంతో పోలిస్తే 25.17 శాతమని వివరించారు. మధ్యంతర బడ్జెట్‌లో, ఆదాయం, సంపద, బహుమతి పన్నులకు సంబంధించి 2014-15 వరకు రూ.25,000 వరకు ఉన్న కొన్ని 1962 నాటి చిన్న పన్ను డిమాండ్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 'ఇవి వివాదాల స్వభావంలో లేవు. రాజీపడని పన్ను డిమాండ్ల స్వభావంలో ఉన్నాయి. మరికొన్ని కొన్ని చాలా పాతవి. ఇవి మెరుగైన పన్ను పరిపాలనకు సహాయపడతాయి' అని ఆయన చెప్పారు.

'ఇండియా'కు ఈ ఎన్నికలు 'ప్రతిష్ఠాత్మకం'

- కూటమిలో సమస్యలను కాంగ్రెస్ పరిష్కరించాలి
- సీట్ల పంపకంలో విశాల దృక్పథం ప్రదర్శించాలి – భాగస్వామ్య పక్ష నేతల వెల్లడి

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, త్వరలో ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని రూపొందించి ప్రజల ముందు ఐక్యతను ప్రదర్శించాలని కొంతమంది ప్రతిపక్ష నాయకులు ఆదివారం అన్నారు. 'ఇండియా' కూటమిలోని అభిప్రాయ భేదాలను పరిష్కరించడంలో కాంగ్రెస్ చొరవ చూపాలని, రాబోయే ఎన్నికలలో బీజేపీకి ఆచరణీయ ప్రత్యామ్నాయంగా ఎదగడానికి సీట్ల పంపకంలో 'పెద్ద మనసు' ప్రదర్శించాలన్నారు. శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది సీట్ల పంపకం చర్చలు ఆలస్యమయ్యాయని అంగీకరించారు. అయితే త్వరలో విషయాలు సరి అవుతాయని, చాలా రాష్ట్రాల్లో సీట్ల కేటాయింపును ప్రకటిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. 'చర్చలు జరుగుతున్నాయి. ఇది ముందుగానే జరిగి ఉండాల్సింది. మేము మా సీట్ల భాగస్వామ్య సమస్యలను పరిష్కరించుకుని, ఐక్యతను ప్రదర్శించడం ద్వారా ప్రజల మనస్సులలో మరింత విశ్వాసాన్ని పెంపొందించవచ్చని నేను అంగీకరిస్తున్నాను' అని తెలిపారు. 'దేశంలో కోట్లాది మంది జీవితాల కోసం పోరాడుతున్నామని భావించి కాంగ్రెస్ మరింత విశాల హృదయాన్ని ప్రదర్శించవలసి ఉంటుందని టీఎంసీ చెప్పినట్లుగానే నేను చెబుతూనే ఉంటాను' అని పీటీఐ వార్తా సంస్థతో అన్నారు. 'దేశంలో రాజ్యాంగ నైతికతతో పాటు ప్రజాస్వామ్య సూత్రాలను కాపాడే ఆలోచనకు మనం పెద్ద నిబద్ధతను చూపించాలి' అని ఆమె అన్నారు. మహారాష్ట్రలో సీట్ల పంపకంపై మాట్లాడుతూ పనులు సజావుగా సాగుతాయని తనకు చాలా నమ్మకం ఉందన్నారు. కొన్ని సీట్లను మినహాయించి చాలా సీట్లపై నిర్ణయం తీసుకున్నామని, త్వరలోనే సీట్ల జాబితాను విడుదల చేస్తామని ఆమె చెప్పారు. కాంగ్రెస్, తృణముల్ కాంగ్రెస్ (టీఎంసీ) నాయకుల మధ్య బహిరంగ వాగ్వాదం మధ్య, పశ్చిమ బెంగాల్‌లో సీట్ల పంపకం జరగనప్పటికీ టీఎంసీ 'ఇండియా' కూటమిలో భాగంగా కొనసాగుతోందన్నారు. బీజేపీని ఓడించేందుకు మమతా బెనర్జీ అత్యంత 'విశ్వాసంతో' ఉన్నారని చతుర్వేది తెలిపారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆదివారం మాట్లాడుతూ గత ఏడాది జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నుంచి సరైన పాఠాలు నేర్చుకుని, 'ఇండియా' కూటమికి పరస్పర విశ్వాసం, పరస్పరం అనుకూలత కలిగి ఉండాలన్నారు. 'రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం, కాంగ్రెస్ మరింత ఉదారతతో వామ పక్షాలు, ఇతర పార్టీలకు సీట్లు ఇవ్వడానికి అనుగుణంగా ఉండాలి' అని రాజా పీటీఐకి చెప్పారు. తెలంగాణలో మాత్రమే కాంగ్రెస్ గెలుపొందిందని, బీజేపీని ఓడించాలనే ప్రాథమిక లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని సీపీఐ తన స్థానాన్ని కాంగ్రెస్‌కు ఇచ్చేందుకు అంగీకరించిందని చెప్పారు. రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పీ) కి చెందిన ఎన్.కె.ప్రేమచంద్రన్ మాట్లాడుతూ సీట్ల పంపకాల చర్చలు, రాష్ట్రాల వారీగా రాజకీయ ఎన్నికల వ్యూహం విషయంలో విపక్షాలు మరింత సీరియస్‌గా ఉండాలని, కాంగ్రెస్ నాయకత్వం వహించి చర్చలు, కార్యక్రమాలు, విధానాలు, మేనిఫెస్టోను ప్రారంభించాలన్నారు. ఇది కీలక సమయం అని పేర్కొంటూ ప్రజలు కాంగ్రెస్, భావసారూప్యత కలిగిన ప్రతిపక్ష పార్టీలవైపు చూస్తున్నారని అన్నారు. 'అందువల్ల కాంగ్రెస్‌తో పాటు 'ఇండియా' కూటమి వచ్చే ఎన్నికలకు సంబంధించి మరింత సీరియస్‌గా ఉండాలి. వివిధ రాష్ట్రాలలో సీట్ల పంపకాలతో పాటు 'ఇండియా' కూటమి మేనిఫెస్టో ఏమిటి, ఉమ్మడి కనీస కార్యక్రమం ఏమిటి, ఇవన్నీ చాలా తీవ్రంగా పరిగణించాలి. ఎందుకంటే గత ఢిల్లీ సమావేశం తర్వాత కూటమి సమావేశం జరగలేదు' అని ఆయన పీటీఐకి చెప్పారు. వివిధ పార్టీల మధ్య అభిప్రాయ భేదాలను తొలగించడానికి కాంగ్రెస్ చొరవ తీసుకోవాలని, ఉమ్మడి కార్యాచరణ కార్యక్రమాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలన్నారు. నితీశ్ కుమార్ కూటమి నుంచి వైదొలిగినప్పటి నుంచి మమతా బెనర్జీ 'భిన్నమైన' వైఖరిని తీసుకుంటున్నారని, అరవింద్ కేజ్రీవాల్ కూడా ప్రస్తుత రాజకీయ పరిణామాలతో 'సంతోషంగా లేరని' ప్రేమచంద్రన్ అన్నారు. 'కచ్చితంగా అటువంటి పరిస్థితిలో కూటమి పక్షాల మధ్య అభిప్రాయ భేదాలను తగ్గించడానికి, బీజేపీకి 'ఇండియా' కూటమిని ఆచరణీయ ప్రత్యామ్నాయంగా మార్చడానికి రాజీ ధోరణిని కలిగి ఉండటానికి కాంగ్రెస్ చొరవ తీసుకోవడానికి నాయకత్వం వహించాలి' అని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఐక్యతా ర్యాలీ నిర్వహించేందుకు ఇదే సరైన సమయమని ప్రేమచంద్రన్ తెలిపారు. 'కానీ ఇండియా కూటమి సమావేశం జరగనందున ఇది లేదు' అని అన్నారు. 'ఇండియా' కూటమిలో భాగస్వాములు ఐక్యంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో సానుకూల సంకేతాలు వస్తాయని మేము ఆశాభావంతో ఉన్నామని సందేశం ఇవ్వాలన్నారు. ధరల పెరుగుదలతో ప్రజలు నేరుగా నష్టపోతున్నారని, అయితే రామ మందిరం వంటి భావోద్వేగ అంశాలను బీజేపీ లేవనెత్తుతుందని కేరళ ఎంపీ అన్నారు. అందుకే మనం ప్రజల వద్దకు చేరుకోవాలని, ప్రజల సమస్యలపై వారిని చైతన్యవంతం చేయాలన్నారు. అటువంటి పరిస్థితిలో మీరు ప్రజల సమస్యలపై ప్రజలను చైతన్యపరచలేకపోతే, తిరిగి రావడం చాలా కష్టమని తెలిపారు. లోక్‌సభ ఎంపీ డానిష్ అలీ మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లో సీట్ల పంపకాల చర్చలు త్వరలో పూర్తవుతాయని, కూటమి భాగస్వాములు కలిసి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇండియా కూటమి కచ్చితంగా ఐక్యంగా ఉంది. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి బలమైన ప్రత్యామ్నాయంగా ఆవిర్భవిస్తుంది' అని ఇటీవల బీఎస్‌పీ సస్పెండ్ చేసిన అలీ అన్నారు. చతుర్వేది మాట్లాడుతూ ఎన్‌డీఏ సీట్ల భాగస్వామ్యాన్ని ఖరారు చేయలేదని, వారి సీట్ల కేటాయింపు గురించి 'వారి 42 మంది భాగస్వాములలో ఎవరికీ తెలియదని' చెప్పారు. గత సెప్టెంబరులో ముంబైలో 'ఇండియా' సమావేశాన్ని నిర్వహించామని, అక్కడ ఊపు పెరిగిందని, అయితే ఎన్నికల కారణంగా అది నెమ్మదించిందన్నారు. కానీ ఈ కూటమి పట్ల తమకు బాధ్యత ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించారని తాను చాలా కచ్చితంగా అనుకుంటున్నానని, మనమందరం మెరుస్తూ వస్తామని శివసేన (యూబీటీ) నాయకుడు అన్నారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ ఎన్‌డీఏలో తిరిగి చేరడంపై చతుర్వేది బీజేపీపై విరుచుకుపడ్డారు. దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటామని, 400 సీట్లకు పైగా గెలుస్తామని వారికి అంత నమ్మకం ఉంటే, 'ఇండియా' కూటమిలో భాగమైన వ్యక్తికి రెడ్ కార్పెట్ వేయాల్సిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు. జేడీయూ అధ్యక్షుడి 'అవకాశవాద' ప్రవర్తనకు ప్రజలు మద్దతు ఇవ్వనందున బీహార్ నుంచి నితీశ్ కుమార్ నిష్క్రమణ 'ఇండియా' కూటమికి సహాయపడుతుందని ప్రేమచంద్రన్ అన్నారు. బీహార్ ప్రజల నుంచి పెద్ద స్పందన వస్తుందని, ఇది వచ్చే ఎన్నికల్లో ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు.

బీజేపీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. కాషాయ పార్టీలో చేరాలని తనపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. తమ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ ఎంతటి కుట్రకైనా తెగబడుతుందని, తనపై ఎంత ఒత్తిడి చేసినా తాను తలవంచబోనని స్పష్టం చేశారు. తాను బీజేపీలో చేరితే కేసుల నుంచి బయటపడేస్తారని, అయితే తాను కాషాయ పార్టీ పంచన చేరే ప్రసక్తే లేదని వారికి తేల్చిచెప్పానని తెలిపారు. ఢిల్లీలోని రోహిణిలో ఓ పాఠశాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీ ప్రభుత్వం ఏటా 40 శాతం బడ్జెట్ విద్యా వైద్యానికి వెచ్చిస్తుంటే బీజేపీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం కేవలం బడ్జెట్‌లో 4 శాతమే ఈ కీలక రంగాలపై ఖర్చు చేస్తోందని విమర్శించారు. ఆప్ సహచరులు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లను కాషాయ పాలకులు జైలు పాలు చేశారని చెప్పారు. ఇప్పుడు కేంద్ర ఏజెన్సీలన్నీ తమ వెంట పడ్డాయని, మంచి ఆస్పత్రులు, మొహల్లా క్లినిక్‌లు ఏర్పాటు చేయడమే సత్యేందర్ జైన్ చేసిన తప్పిదమా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల పెంపునకు పాటుపడిన మనీశ్ సిసోడియానూ విడిచిపెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పాలకులు ఎన్ని కుట్రలు పన్నినా తాము తలవంచబోమని అన్నారు. ఢిల్లీ ప్రజలు తమపై ప్రేమను, ఆశీస్సులను ఇలాగే అందించాలని కేజ్రీవాల్ కోరారు.

వైసీపీకి అసంతృప్త నేతల షాక్

- అనుచరులతో ఎమ్మెల్యే వసంత భేటీ
- టీడీపీ వైపు చూపు...వ్యతిరేకిస్తున్న దేవినేని ఉమా వర్గం
- జనసేనలోకి ఎంపీ బాలశౌరి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిల మార్పులు చేర్పులతో అసంతృప్తులంతా పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. తాజాగా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కూడా ఇదే బాట పడ్డారు. ఈనెల 3వ తేదీన ఏలూరుజిల్లా దెందులూరులో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఆయన హాజరు కాలేదు. ఈ విషయాన్ని ఆయన ముందస్తుగానే పార్టీ ముఖ్యనేతలకు లీక్‌లు ఇచ్చారు. దీంతో అధిష్ఠానం అప్రమత్తమై మైలవరం ఇన్‌ఛార్జిగా జెడ్పీటీసీ సర్నాల తిరుపతిరావు యాదవ్‌ను ప్రకటించింది. దీంతో పార్టీ ఇచ్చిన షాక్‌కు బదులిచ్చే దిశగా వసంత కృష్ణప్రసాద్ తన అనుచరులతో భేటీ అయ్యారు. సోమవారం మరోసారి చర్చించి మీడియా ముందుకు రానున్నారు. వసంత చేరికను మైలవరం టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఏకంగా వసంత కృష్ణప్రసాద్, ఆయన తండ్రి వసంత నాగేశ్వరరావుపై దేవినేని ఉమా ఘాటు వ్యాఖ్యలు చేశారు. నందిగామ, మైలవరం టీడీపీని నాశనం చేశారంటూ ఆరోపించారు. 2019 ఎన్నికల్లో తనను కుట్ర పూరితంగా వసంత కృష్ణప్రసాద్ ఓడించారని మండిపడ్డారు. వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరితే ఆయన మైలవరం టికెట్‌ను ఆశిస్తారని సమాచారం. దీంతో దేవినేని ఉమా టికెట్ గల్లంతయ్యే అవకాశముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా కృష్ణప్రసాద్ చేరికను దేవినేని ఉమా వర్గం వ్యతిరేకిస్తోంది. వసంత టీడీపీలో చేరిక ఖాయం కావడంతో ఆయన అనుచరులపై వైసీపీ వేటు వేసింది. మైలవరం పరిధిలోని 28 మంది కోఆపరేటివ్ సొసైటీల చైర్మన్లు, సభ్యులను తప్పిస్తూ ప్రభుత్వం ఆదేశించింది. అటు మచిలీపట్నం ఎంపీ బాలశౌరి జనసేనలో చేరారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన వైసీపీ అధినేత జగన్‌పైన, ప్రభుత్వంపైన తీవ్ర విమర్శలు చేశారు. జనసేన నాయకుల సత్తా ఏమిటో జగన్‌కు చూపిస్తారని హెచ్చరించారు. అంతకముందు తన నివాసం నుంచి భారీ కార్ల ర్యాలీతో జనసేన కార్యాలయానికి తరలివచ్చారు. నెల్లూరు టౌన్‌లో మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ కూడా తన అనుచరులు, నియోజకవర్గ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇటీవల అనిల్‌ను నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రతిపాదించింది. దీంతో ఆయన నెల్లూరు నుంచి నరసరావుపేట ఎంపీ పరిధిలో కార్యకలాపాల్ని కొనసాగించనున్నారు.

డీఎస్పీల బదిలీపై విచారణ

సీఈసీకి అచ్చెన్నాయుడు లేఖ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాబోయే ఎన్నికల్లో వైసీపీకి లబ్ధి చేకూర్చే దిశగా డీఎస్పీల బదిలీలు జరిగాయని, వాటిపై విచారణకు ఆదేశించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. 42 మంది డీఎస్పీల బదిలీలపై విచారించాలన్నారు. మరో 10 మంది పేర్లను, వారిపై ఉన్న అభియోగాలను ఆ లేఖలో వివరించారు. ఎమ్మెల్యే భూమన కరుణా కర్‌రెడ్డిని తిరుపతి కలెక్టర్ లక్ష్మీశ కలవడంపై విచారించాలని అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో భూమన తక్కువ మెజా ర్టీతో గెలిచారని, లక్ష్మీశ నిష్పక్షపాతంగా ఉంటారన్న నమ్మకం తమకు లేదన్నారు. ప్రోటోకాల్ పక్కన పెట్టి ఎమ్మెల్యేను కలెక్టర్ కలవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతోపాటు డీఎస్పీల బదిలీల వ్యవహారంపై సీఈసీ సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు.

'యూసీసీ' ముసాయిదాకు ఉత్తరాఖండ్ కేబినెట్ ఆమోదం

డెహ్రాడూన్: ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)పై నిపుణుల కమిటీ రూపొందించిన ముసాయిదాకు ఉత్తరాఖండ్ మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ అధ్వర్యంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశం దీనికి ఆమోదం తెలుపుతూ తీర్మానించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీ ఈ ముసాయిదాను రూపొందించింది. తుది నివేదికను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. యూసీసీపై చట్టం చేయడానికి సోమవారం నుంచి శాసనసభ నాలుగు రోజుల పాటు సమావేశం కానుంది. ముసాయిదాకు కేబినెట్ ఆమోదం లభించడంతో అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ చట్టం అమలైతే... స్వాతంత్ర్యం తర్వాత యూసీసీ తెచ్చిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలవనుంది.

కాల్పుల విరమణ పాటించాలి

పలస్తీనా సంఘీభావ సభలో అద్నాన్ మహ్మద్

విశాలాంధ్ర–హైదరాబాద్: ఇజ్రాయిల్ ఎన్ని దాడులు చేసినా, తామంతా పాలస్తీనా భూభాగంలోనే జీవిస్తామని, అక్కడే మరణిస్తామని పాలస్తీనా ప్రజలు దృఢ నిశ్చయంతో ఉన్నారనీ, భారత్‌లో పలస్తీనా రాయబారి అద్నాన్ మహ్మద్ జబేర్ అబుల్ హయెజా అన్నారు. ఇజ్రాయిల్‌పై అక్టోబర్ 7న హమస్ చేసిన దాడిని ఉగ్రవాద చర్య అంటున్నారని, అంతకుముందు గాజాపై ఇజ్రాయిల్ చేసిన దాడుల నేపథ్యంలో చూస్తే వాస్తవాలు అర్థమవుతాయన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'పలస్తీనా సంఘీభావ సభ' జరిగింది. సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా పలస్తీనా రాయబారి అద్నాన్ మహ్మద్ , సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు పల్లభ్ సేన్ గుప్తా, డాక్టర్ కె.నారాయణ, రామకృష్ణ పాండా, జాతీయ కార్యవర్గ సభ్యులు కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, అనీరాజా హాజరయ్యారు. అద్నాన్ మహ్మద్ జబేర్ అబుల్ హయెజా ప్రసంగిస్తూ అక్టోబర్ 7న అకస్మాత్తుగా ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి చేసిందని, అది దురాక్రమణ, ఉగ్రవాద చర్య అని చాలా మంది భావిస్తున్నారని , పలస్తీనా చరిత్ర తెలిసిన వారికి వాస్తవాలు అర్థమవుతాయన్నారు. ఎవరైనా ఆక్రమింపబడిన వారు ఉగ్రవాదులు కారని, ఆక్రమణదారులే అసలైన ఉగ్రవాదులు అని చెప్పారు. 75 ఏళ్ల హత్యలు, హింస, 10 లక్షల మందికి పైగా అరెస్టులు, వెస్ట్ బ్యాంక్‌లో నివాసితులను వెళ్లగొట్టడం, ఓస్లో ఒప్పందం ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. గాజా స్ట్రిప్ 23 లక్షల మంది నివసిస్తున్నారని, అందులో 75 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారని చెప్పారు. హమాస్ దాడి జరిగిన అక్టోబర్ 7వ తేదీకి ముందు గాజా స్ట్రిప్ 260 మంది పాలస్తీనీయులను ఇజ్రాయిల్ చంపేసిందని, 75 ఏళ్ల చరిత్రలో ప్రస్తుతం ఉన్నది అత్యంత అతివాద ప్రభుత్వమని చెప్పారు. ప్రతి రోజు తూర్పు జెరుసలేం ఇతర పాలస్తీనా ప్రాంతాల్లో అనేక మందిని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేందుకు బలవంతం చేస్తున్నారని విమర్శించారు. ఇజ్రాయిల్ దురాక్రమణ, మారణ హోమం లక్షమేమిటంటే పాలస్తీనా నుంచి గాజా నుంచి ఈజిప్టుకు, వెస్ట్ బ్యాంక్ నుంచి జోర్డాన్ దేశాలకు తరిమివేయడమేనని వివరించారు. అక్టోబర్ 7 తరువాత 120 రోజుల్లో గాజా ప్రాంతంలో 27వేల మంది పాలస్తీనీయులను ఇజ్రాయెల్ బలగాలు చంపేశాయని, అందులో 11 వేల మంది పిల్లలు, 8వేల మంది శిథిలాల కింద చిక్కుకున్నారని చెప్పారు. గాజాను ధ్వంసం చేశారని, 66 వేల టన్నుల పేలుడు పదార్థాలను ప్రయోగించారని తెలిపారు. ప్రస్తుతం 11,700 మందిని ఖైదు చేశారని అన్నారు. ఇప్పటికీ 122 మంది జర్నలిస్టులను చంపేశారని అన్నారు. ఐక్య రాజ్య సమితి తీర్మానం నంబర్ 194 అత్యంత ముఖ్యమైనదని, దాని ప్రకారం పలస్తీనీయులకు అక్కడే నివసించే హక్కు ఉన్నదన్నారు. ఐక్యరాజ్య సంస్థ ఆధ్వర్యంలో పలస్తీనా శరణార్థులకు, పేదలకు సాయం చేసే ఒనుర్వా సంస్థకు ఆర్థిక సాయాన్ని నిలిపివేశారని వెల్లడించారు. ప్రపంచమంతా కాల్పుల విరమణ చేయాలని కోరుతున్నప్పటికీ ఇజ్రాయిల్ పెడచెవిన పెడుతున్నదన్నారు. అయినప్పటికీ పలస్తీనా ప్రజలు మాతృభూమిలోనే జీవిస్తామని, ఇక్కడే మరణిస్తామని నిర్ణయం తీసుకున్నారని అద్నాన్ మహ్మద్ స్పష్టం చేశారు.

రెండు దేశాల పరిష్కారానికి అంగీకరించాలి: డి.రాజా: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలోని అలీన విదేశాంగ విధానం నుంచి వైదొలిగి సామ్రాజ్యవాద,అమెరికా అనుకూల విధానాన్ని అవలంబిస్తోందని డి.రాజా విమర్శించారు. భారతదేశంలో ఏ ప్రభుత్వం వచ్చినా, వారు ఎలాంటి వైఖరి తీసుకున్నా సీపీఐ మాత్రం పలస్తీనా ప్రజలకు మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇజ్రాయిల్ పిల్లలకు , మహిళలకు తిండి, మందులు లేవని, ఈ పరిస్థితులలో యుద్ధం ఆగిపోవాలని, ఇందుకు రాజకీయ పరిష్కారం కావాలని, ఇజ్రాయిల్ రెండు దేశాల పరిష్కారానికి అంగీకరించాలన్నారు. ఇజ్రాయెల్ ఉండొద్దని పాలస్తీనా అనొద్దని, అలాగే పాలస్తీనా వద్దని ఇజ్రాయెల్ అనొద్దన్నారు. పాలస్తీనాలోని గాజా స్ట్రిప్ 23 లక్షల మందిని ఇజ్రాయిల్ నిరాశ్రయులను చేసిందని పల్లభ్ సేన్ గుప్తా అన్నారు. పాలస్తీనాకు కేవలం సీపీఐ మాత్రమే కాదని, మహాత్మాగాంధీ కూడా మద్దతు తెలిపారని, పలస్తీనాకు స్వాతంత్ర్యం వచ్చేంత వరకు భారత స్వాతంత్ర్యం పూర్తి కాదని తొలి ప్రధాని జవహర్ నెహ్రూ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పలస్తీనాకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ సభలో తీర్మానం చేశారు. సభలో అప్పటికప్పుడు పలస్తీనాకు సంఘీభావంగా సభికులు ఇచ్చిన రూ.50 వేల విరాళాన్ని పలస్తీనా రాయబారికి డి.రాజా అందజేశారు.

శివసేన నేతపై కాల్పులు జరిపిన

బీజేపీ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు

ముంబై: థానే జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో శివసేన నాయకుడిపై కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్‌పై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీల నిరోధక) చట్టం కేసు నమోదు చేసినట్లు అధికారి ఆదివారం తెలిపారు. జనవరి 31న గైక్వాడ్‌తో పాటు మరో ఏడుగురు తనను కులపరమైన వేధింపులకు గురిచేశారని గ్రామస్తురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. కళ్యాణ్ శివసేన నాయకుడు మహేష్ గైక్వాడ్ పైకి గైక్వాడ్ ఆరు బుల్లెట్లను కాల్చాడు. హిల్ లైన్ పోలీస్ స్టేషన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ క్యాబిన్‌లో శుక్రవారం అర్ధరాత్రి అతని సహచరుడు రాహుల్ పాటిల్‌ను గాయపరిచాడు. ఈ కేసులో కళ్యాణ్ తూర్పు ఎమ్మెల్యేపై హత్యాయత్నం, ఇతర నేరాభియోగాలు నమోదయ్యాయి. 'శనివారం ద్వార్లీ గ్రామ నివాసి ఫిర్యాదు మేరకు గణపత్ గైక్వాడ్, మరో ఏడుగురిపై భారతీయ శిక్షాస్మృతి, షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద అభియోగాలు మోపారు. భూమి యజమాని అయిన మహిళ ఆరోపణలపై విచారణ జరుగుతోంది' అని హిల్ లైన్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

ఫలితం దిశగా రెండో టెస్టు

విశాఖపట్నం: భారత్–ఇంగ్లాండ్ క్రికెట్ మధ్య విశాఖపట్నంలో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే టీమిండియాకు 9 వికెట్లు అవసరం కాగా... ఇంగ్లాండ్ 332 పరుగులు చేయాల్సి ఉంది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉండటంతో మ్యాచ్ ఫలితం తేలడం ఖాయంగా కనిపిస్తోంది. మూడోరోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా నిర్దేశించిన 399 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 67 పరుగులు చేసింది. క్రీజ్‌లో జాక్ క్రాలే (29), రెహాన్ అహ్మద్ (9) ఉన్నారు. ఓపెనర్ బెన్ డకెట్ (28)ను అశ్విన్ ఔట్ చేశాడు. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 332 పరుగులు అవసరం కాగా... భారత్‌కు 9 వికెట్లు కావాలి. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 255 పరుగులు చేసింది.

శతకంతో రాణించిన గిల్

ఓవర్ నైట్ 28/0 స్కోరుతో మూడో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (17), రోహిత్ శర్మ (13) ఎక్కువ సమయం క్రీజ్‌లో నిలవలేదు. అయితే శుభ్‌మన్ గిల్ (104) సెంచరీతో తనపై వస్తున్న విమర్శలను కొట్టిపడేశాడు. శ్రేయస్ (29) కుదురుకున్నట్లు కనిపించినా... బెన్ స్టోక్స్ అద్భుత రీతిలో క్యాచ్ అందుకోవడంతో పెవిలియన్‌కు మళ్లాడు. రజత్ పటీదార్ (9), శ్రీకర్ భరత్ (6) నిరాశపరిచారు. అక్షర్ పటేల్ (45), అశ్విన్ (29) కీలక పరుగులు సాధించారు. బుమ్రా (0: 26 బంతుల్లో) పరుగులు చేయనప్పటికీ... క్రీజ్‌లో నిలిచి అశ్విన్‌కు అండగా నిలిచాడు. మూడో రోజు ఆటలో 227 పరుగులు జోడించి పది వికెట్లను కోల్పోయిన భారత్... రెండో ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ బౌలర్లు టామ్ హార్ట్‌లీ 4, రెహాన్ అహ్మద్ 3, అండర్సన్ 2, బషీర్ ఒక వికెట్ తీశారు.

తెలంగాణా సాయుధ పోరాట యోధుడు మఖ్దూం మొహియుద్దీన్ 116వ జయంతి సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో నివాకులర్పిస్తున్న సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు కె.నారాయణ, అజీజ్‌పాషా, వినయ్ విశ్వం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తదితరులు

'న్యూఏజ్ వీక్లీ' ఆన్‌లైన్ ఎడిషన్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా. పక్కన వినయ్ విశ్వం, రామకృష్ణ పాండా, కాంగో, అమర్‌జీత్‌కౌర్ తదితరులు

ఆకలితో అలమటించి పిల్లి మాంసం తిన్న యువకుడు



మల్లప్పురం: కేరళలోని మలప్పురం జిల్లాలోని కుట్టిప్పురంలో దిగ్భ్రాంతి కలిగించే సంఘటన జరిగింది. చాలా రోజుల నుంచి ఆహారం తీసుకోని స్థితిలో ఉన్న తర్వాత అసోంకు చెందిన ఒక యువకుడు పిల్లి పచ్చి మాంసాన్ని తింటూ కనిపించాడు. ఫిబ్రవరి 3వ తేదీ శనివారం సాయంత్రం రద్దీగా ఉండే బస్టాండ్ ఆవరణలో ఈ ఘటన జరిగింది. 27 ఏళ్ల ఆ వ్యక్తి అసోంలోని ధుబ్రి జిల్లాకు చెందినవాడని పోలీసులు తెలిపారు. బస్టాండ్ మెట్ల మార్గంలో కూర్చుని చనిపోయిన పిల్లి పచ్చి మాంసాన్ని తింటున్నట్లు స్థానికులు గుర్తించారని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'సమాచారం అందుకున్న తరువాత, మేము సంఘటన స్థలాన్ని సందర్శించాము. అతనిని విచారించినప్పుడు ఐదు రోజులుగా ఎటువంటి ఆహారం తీసుకోలేదని చెప్పాడు' అని అధికారి పీటీఐకి తెలిపారు. కొంత ఆహారాన్ని అందించగా దానిని తీసుకునేందుకు అంగీకరించాడని, అయితే కొంత సమయం తర్వాత ఎవరికీ చెప్పకుండా అక్కడి నుంచి అదృశ్యమయ్యాడని అన్నారు. 'ఈ రోజు (ఆదివారం) ఉదయం మలప్పురంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో యువకుడు దొరికినట్లు మాకు సమాచారం అందింది' అని వివరించారు. వ్యక్తి వాంగ్మూలాల ఆధారంగా, అతను ఈశాన్య రాష్ట్రంలో ఒక కళాశాల విద్యార్థి, అతను కుటుంబ సభ్యులకు తెలియకుండా డిసెంబరులో రైలులో కేరళ చేరుకున్నాడు. 'చెన్నైలో పనిచేస్తున్న తన సోదరుడి మొబైల్ నంబరును మాకు ఇచ్చాడు. మేము అతనిని సంప్రదించాము. సమాచారం సరైనదని నిర్ధారించాం' అని అధికారి చెప్పారు. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం ఆ వ్యక్తిని పొరుగున ఉన్న త్రిసూర్‌లోని ఆస్పత్రిలో చేర్చారు. ఆ వ్యక్తికి ఎలాంటి శారీరక, మానసిక సమస్యలు లేవని, బంధువులు ఇక్కడికి రాగానే ఆ యువకుడిని అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.